సోమవారం
20-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 119
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఢిల్లీ ఎన్నికల బరిలో 719 మంది

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆప్ అధిపతి, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో పోటీ చేస్తున్నారు. మొత్తం 1,040 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప సంహరణ గడువు తర్వాత 981 నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించారు. స్క్రూటినీ తర్వాత 477 నామినేషన్లు తిరస్కరించారు. దీంతో 719 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో అరవింద్ కేజ్రీవాల్‌తో బీజేపీకి చెందిన పర్వేష్ వర్మ (సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు), కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్ (షీలా దీక్షిత్ కుమారుడు) తలపడుతున్నారు.

ఖోఖో ప్రపంచకప్ విజేత భారత్

న్యూఢిల్లీ: ఖోఖో ప్రపంచకప్-2025ను భారత్ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో మహిళలు, పురుషుల విభాగాల్లో జరిగిన ఫైనల్ పోరులో భారత మహిళలు, పురుషుల జట్లు ఘన విజయంసాధించాయి. రెండు మ్యాచ్‌ల్లోనూ ప్రత్యర్థి జట్టు నేపాల్ కావడం విశేషం. తొలుత భారత మహిళల ఖోఖో జట్టు నేపాల్‌పై 78-40 స్కోరుతో ఘన విజయం సాధిచింది. పురుషుల విభాగంలో జరిగిన ఫైనల్ పోరులో భారత జట్టు 54-36 తేడాతో నేపాల్ జట్టును చిత్తు చేసి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. తొలిసారి

- మిగతా 2 లో

రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు

న్యూఢిల్లీ: అసోంలోని గువాహటి పోలీస్ స్టేషన్‌లో మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులు దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే

- మిగతా 2 లో



ట్రంప్ అధ్యక్ష బాధ్యతల స్వీకారానికి సర్వం సిద్ధం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాజధాని వాషింగ్టన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 78 ఏళ్ల ట్రంప్ దేశానికి 47వ అధ్యక్షుడిగా సోమవారం (20వ తేదీ) ప్రమాణం చేయనున్నారు. 82ఏళ్ల జో బైడెన్ నుంచి ఆయన అధ్యక్ష బాధ్యతలను స్వీకరించనున్నారు. గడ్డకట్టే చలి కారణంగా బహిరంగ ప్రదేశంలో కాకుండా క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్ ఆవరణలో ప్రమాణ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అందాక, ఇది చేస్తూ ఉండు!

దిగొచ్చిన కేంద్రం

- రైతులతో ఫిబ్రవరి 14న చర్చలకు ఆహ్వానం
- వైద్య సహాయం తీసుకోవడానికి దలేవాల్ అంగీకారం
- చర్చలకు తలుపులు తెరవడమే పెద్ద విజయం : రైతు నాయకులు

చండీగఢ్/న్యూఢిల్లీ: దేశానికి అన్నదాతగా ఉన్న రైతుల ఐక్యత కేంద్ర ప్రభుత్వాన్ని దిగొచ్చేలా చేసింది. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కి చట్టపరమైన హామీ, ఇతర డిమాండ్లను పరిష్కరించాల్సిన మోదీ సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తుండటంపై దేశవ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. పంజాబ్ రైతులు పెద్ద సంఖ్యలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీస్తూ... పంజాబ్, హర్యానా సరిహద్దులో ఖనౌరీ పాయింట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ క్రమంలో శనివారం, వ్యవసాయ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియ రంజన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కేంద్ర ప్రతినిధి బృందం ఖనౌరి సరిహద్దు పాయింట్ వద్ద రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్, సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రతినిధులను కలిసి ఫిబ్రవరి 14న చర్చలను తిరిగి ప్రారంభించడానికి వారిని ఆహ్వానించింది. ప్రతిపాదిత సమావేశం ప్రకటించిన తర్వాత దలేవాల్ వైద్య సహాయం తీసుకోవడానికి అంగీకరించారు.

సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర) కన్వీనర్ అయిన దలేవాల్... తమ వివిధ డిమాండ్లకు మద్దతుగా గత సంవత్సరం నవంబరు 26 నుంచి పంజాబ్, హర్యానా మధ్య ఖనౌరి సరిహద్దు వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. అయితే ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ ఆయన తన దీక్షను కొనసాగిస్తున్నారు. అప్పటి నుంచి ఆయన ఎటువంటి వైద్య సహాయాన్ని నిరాకరిస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రతినిధులతో సమావేశం తర్వాత, నిరసన తెలిపిన రైతులు దలేవాల్ వైద్య సహాయం తీసుకుంటున్నట్లు చూపించే చిత్రాలను విడుదల చేశారు. అయితే, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధంగా హామీ ఇచ్చే వరకు దలేవాల్ తన నిరవధిక నిరాహార దీక్షను విరమించబోరని రైతు నాయకులు తెలిపారు. జనవరి 4న ఖుడియన్ ఈ విషయంలో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జోక్యం చేసుకోవాలని కోరుతూ, నిరసన తెలుపుతున్న రైతులతో కేంద్రం వీలైనంత త్వరగా చర్చలు జరపాలని కోరారు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఫిబ్రవరి 9 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకూడదని ఫిబ్రవరి 14న సమావేశం నిర్వహించాలని అధికారులు తమకు చెప్పారని రైతు నాయకులు శనివారం తెలిపారు. చర్చల పునఃప్రారంభానికి సంబంధించిన లేఖను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం శనివారం దలేవాల్, ఎస్‌కేఎం (రాజకీయేతర), కేఎంఎంకు

- మిగతా 2 లో

ఐటీ పార్క్... మరో మైలురాయి

- 'క్యాపిటల్ ల్యాండ్' ప్రతినిధులతో సీఎం బృందం చర్చలు
- రూ.450 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చిన కంపెనీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో రూ.450 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సింగపూర్ కేంద్రంగా విస్తరించిన ఈ కంపెనీ ప్రపంచ స్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటి. హైదరాబాద్‌లో 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆదివారం కంపెనీతో జరిపిన ఉన్నతస్థాయి సమావేశంలో క్యాపిటల్ ల్యాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, సీఎంవో స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ తరపున ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ సీఈవో గౌరీశంకర్ నాగభూషణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ హాజరయ్యారు. క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల కు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అన్ని సౌకర్యాలు ఈ ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయి. గౌరీ శంకర్ నాగభూషణం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిరంగా వృద్ధి చెందుతోందని, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్ పార్క్, అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పెర్ల్ పార్కులను చేపట్టిందన్నారు. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాదిలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. ఐటీపీహెచ్ రెండో దశ 2028 నాటికి పూర్తి కానుంది.

ఎట్టకేలకు అమల్లోకి కాల్పుల విరమణ 2లో

పెట్టుబడులే లక్ష్యంగా...

- దావోస్ బయలుదేరిన సీఎం రేవంత్ బృందం
- నేటి నుంచి వరల్డ్ ఎకానమీ ఫోరమ్ సదస్సు
- సింగపూర్ వ్యాపార దిగ్గజాలతో చర్చలు ఫలప్రదం

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రపంచ వేదికపై తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటి చెప్పి హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల స్వర్గధామంగా పరిచయం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్వర్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆదివారం రాత్రి దావోస్ బయల్దేరి వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా సాగిన రేవంత్ రెడ్డి సింగపూర్ పర్యటన ముగియడంతో సోమవారం దావోస్‌కు చేరుకుని అక్కడ నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొంటారు. సింగపూర్ పర్యటన విజయవంతం కావటంతో దావోస్ సదస్సుపై భారీ అంచనాలు పెట్టుకుంది. చివరి రోజైన ఆదివారం సింగపూర్‌లో ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, బిజినెస్ ఫెడరేషన్ ప్రతినిధులతో ముఖాముఖి

- మిగతా 2 లో

భూమిలేని ఉపాధి కూలీ కుటుంబాలకే
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

మంత్రి సీతక్క

విశాలాంధ్ర-హైదరాబాద్: భూమి లేని ఉపాధి కూలీలకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి సీతక్క ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు దఫాల్లో ఏడాదికి రూ.12 వేలు సాయం అందిస్తూ తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలవబోతుందని తెలిపారు. కొన్ని రాజకీయ శక్తులు ఈ పథకంపై తప్పుడు గణంకాలతో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. పదేళ్ల అధికారంలో ఉండి కూలీలను పట్టించుకోని నేతలు... ఇప్పుడు వారిపై కపట ప్రేమ కురిపిస్తున్నారని మండిపడ్డారు. రూ. 500 కోట్ల ఆస్తులున్న వారికి సైతం రైతు బంధు ఇచ్చి, ఆస్తి పాస్తులు లేని కూలీలను పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి భూమిలేని కూలీలకు ఆత్మీయ భరోసా ఇస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎంజీఎన్ ఆర్ఈజీఏ పోర్టల్ అధికారిక లెక్కల ప్రకారమే 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ వ్యాప్తంగా 48,13,966 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయని వివరించారు. ఇందులో 22.64 లక్షల కుటుంబాలు కనీసం ఒక్క రోజు కూడా ఉపాధి పనుల్లో పాల్గొనలేదని, కేవలం జాబ్ కార్డు కలిగి ఉన్నంత మాత్రాన ఉపాధి కూలీగా పరిగణించలేమన్నారు. కూలీ ద్వారా జీవనోపాధి పొందితేనే ఉపాధి కూలీగా పరిగణించబడతారని తెలిపారు. కనిష్టంగా 20 రోజుల పాటు ఉపాధి కూలీగా పని చేసిన కుటుంబాలనే, ఉపాధి హామీ ఆధారిత కుటుంబాలుగా

- మిగతా 2 లో

కేంద్ర సాయంతో ముందుకు

- రాష్ట్రం ఇంకా కోలుకోలేదు
- గత అసమర్థపాలనతో ఇబ్బందులు
- ఎన్డీఆర్ఎఫ్ సేవలు నిరుపమానం
- అమిత్‌షా పనితీరు చూస్తే... అసూయ
- ఏపీ సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రప్రభుత్వం సహాయ సహకారాలందించడం వల్లే ఎన్నికల సమయానికి వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రం... ఆ స్థితి నుంచి బయటపడిందని, ఇంకా కోలుకోలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. 'అమరావతికి కేంద్రం నుంచి రూ.15వేల కోట్లు ఇచ్చారు.. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల ఆర్థికసాయం చేసి ప్రాణం పోశారు. ఇటీవల విశాఖ రైల్వేజోన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు కేంద్రం మద్దతు ఇంకా కావాలి. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ పనులు జరుగుతున్నాయి. కేంద్రం మద్దతుతో ఏప్రిల్ 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తాం' అని చంద్రబాబు తెలిపారు. 2014లో జరిగిన రాష్ట్ర విభజన, 2019లో వచ్చిన అసమర్థ ప్రభుత్వం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, అయినా కేంద్రం మద్దతుతో సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రాన్ని అగ్రపథాన నిలబెడతామన్న నమ్మకం తమకుందని చంద్రబాబు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా, కొండపావులూరులో ఆదివారం జరిగిన ఎన్డీఆర్ఎఫ్ 20వ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో కలిసి సీఎం పాల్గొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్, ఎన్ఐడీఎమ్ సౌత్ క్యాంపస్ భవనాలను అమిత్‌షాతో కలిసి ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఎక్కడ ఏ విపత్తు వచ్చినా మొదటగా

- మిగతా 2 లో

ఏపీ అభివృద్ధి నా బాధ్యత

- గతం విధ్వంసం గురించి చింతించొద్దు
- బాబు-మోదీ జోడీతో మూడింతల ప్రగతి
- పూర్తి సహాయ సహకారాలందిస్తాం
- 2028 కల్లా అందుబాటులో 'పోలవరం'
- ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో హోంమంత్రి అమిత్‌షా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం గురించి చింతించవద్దని, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ అండదండలు ఉంటాయని అమిత్ షా వ్యాఖ్యానించారు. చంద్రబాబు, మోదీ జోడీ నాయకత్వంలో ఏపీ మూడింతల ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం కృష్ణాజిల్లా కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ 20వ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్, ఎన్ఐడీఎం భవనాల్ని ప్రారంభించారు. ఎన్డీఆర్ఎఫ్ పరికరాల గ్యాలరీని ఆయన సందర్శించారు. తిరుపతి రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రులు రామ్మోహన్, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అమిత్‌షా

- మిగతా 2 లో

ప్రమాద రహితంగా కొత్తగూడెంను
తీర్చిదిద్దుదాం

ట్రాఫిక్ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత: కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైం: ప్రతిఒక్కరు సమన్వయంతో పనిచేస్తూ కొత్తగూడెంను ప్రమాద రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక క్లబ్‌లో పోలీసు, వ్యాపారులు, ప్రైవేట్ వాహన డ్రైవర్లు, పట్టణ ప్రముఖులతో ఆదివారం సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... ట్రాఫిక్ నియంత్రణ కేవలం పోలీసులదే కాదన్నారు. ప్రతి పౌరుడు తమ బాధ్యతగా భావించాలన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. మద్యం, బాధ్యతారాహిత్యం ప్రమాదాలకు ప్రధాన కారణమని స్పష్టం చేశారు.

వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేసుకువాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్కింగ్ స్థలాలను అన్వేషించి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. చిరువ్యాపారులు రోడ్లను ఆక్రమించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నిబంధనలు మేరకు షాపులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్తగూడెం కార్పొరేషన్‌గా రూపాంతం చెందడంతో పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలపై మరింత

- మిగతా 2 లో

ఎట్టకేలకు అమల్లోకి కాల్పుల విరమణ

15 నెలల యుద్ధానికి ముగింపు

ఆఖరి నిమిషం వరకు గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయిల్ దళాలు

జెరూసలేం: పదిహేను నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతూ ఇజ్రాయిల్‌- హమాస్‌ గాజాలో ఎట్టకేలకు కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8.30 గంటలకే ఇది అమల్లోకి రావాల్సి ఉండగా దాదాపు మూడు గంటలు ఆలస్యమైంది. హమాస్‌ విడుదల చేయబోయే ఇజ్రాయిల్‌ బందీల జాబితాను వెల్లడించడంలో జాప్యం కావడంతో తొలుత శాంతి ఒప్పందం అమలుపై సందిగ్ధం నెలకొంది. చివరకు ముగ్గురు బందీల వివరాలను హమాస్‌ సోషల్‌ మీడియా వేదికగా విడుదల చేసింది. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం అమలుకు ఇజ్రాయిల్‌ అంగీకరించింది. ఈ ముగ్గురు బందీలు విడుదల కానున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు హమాస్‌ ఒప్పందాన్ని ఆలస్యం చేస్తోందని ఇజ్రాయిల్‌ సైన్యం ఆరోపించింది. అందుకే తమ సైన్యం గాజాలో దాడులు కొనసాగిస్తోందని ఐడీఎఫ్‌ అధికార ప్రతినిధి డేనియల్‌ హగారీ చెప్పారు. తొలి విడత విడుదల చేయబోయే ముగ్గురు బందీల పేర్లను హమాస్‌ విడుదల చేసేంత వరకూ ఒప్పందం అమల్లోకి రాదని హగారీ కూడా చెప్పారు. ఈ క్రమంలోనే ఇజ్రాయిల్‌ సేనలు గాజాపై దాడులు చేసినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. ఈ దాడుల్లో ఎనిమిది మంది మృతి చెందగా, 25 మంది గాయపడినట్లు వెల్లడించింది. కాగా సాంకేతిక కారణాలతో బందీల వివరాలు అందజేయడంలో ఆలస్యమయినట్లు హమాస్‌ ప్రకటించింది. ఎట్టకేలకు వివరాలు వెల్లడించడం వల్ల కాల్పుల విరమణ అమలుకు మార్గం సుగమమైంది. మూడు దశల్లో కాల్పుల విరమణ ఒప్పందం సాగనుండగా, తొలి దశలో 42 రోజులు తాత్కాలిక కాల్పుల విరమణ జరుగుతుంది. ఈక్రమంలో తమ చెరలో ఉన్న 33 మంది బందీలను హమాస్‌ విడుదల చేయనుంది. ఇందుకు ప్రతిగా తమ కారాగారాల్లో ఉన్న 737 మంది పలస్తీనా ఖైదీలకు ఇజ్రాయిల్‌ విడుదల చేయనుంది. ఖైదీలతో పాటు 2023 అక్టోబరు 7న హమాస్‌ చేసిన దాడులతో సంబంధం లేని 1,167 మంది గాజా వాసులకు కూడా స్వేచ్ఛ లభించనుంది. తొలి దశలో జనావాస ప్రాంతాల నుంచి ఇజ్రాయిల్‌ దళాలు వైదొలగనున్నాయి. భారీస్థాయిలో మానవతా సాయం కూడా గాజాలోకి ప్రవేశించనుంది. రెండో దశలో మిగిలిన బందీలను హమాస్‌ విడుదల చేస్తుంది.

పెట్రోలు ట్యాంకర్‌ పేలి 77 మంది మృతి

అబుజా: పశ్చిమ ఆఫ్రికాలోని నైజీరియాలో ఓ పెట్రోల్‌ ట్యాంకర్‌ పేలిన ఘటనలో 77మంది మరణించారు. సెంట్రల్‌ నైజీరియాలోని నైజర్‌లో ఉన్న సులేజా ప్రాంతంలో కొంతమంది ఓ ట్యాంకర్‌ నుంచి మరో ట్యాంకర్‌లోకి జనరేటర్‌ ఉపయోగించి పెట్రోల్‌ పంప్‌ చేస్తుండగా పేలుడు జరిగింది. పేలుడు తీవ్రతకు పెట్రోల్‌ను పంపు చేస్తున్నవారితోపాటు చుట్టుపక్కల కొన్ని మీటర్ల ఉన్నవారు కూడా మృతిచెందినట్లు నైజీరియా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్‌ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రమాదంలో మరో 25 మంది గాయపడ్డారని పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. మృతుల్లో చాలామంది గుర్తించలేనంతగా కాలిపోయారని తెలిపింది. సరుకు రవాణాకు సరైన రైల్వే వ్యవస్థ లేకపోవడంతో నైజీరియాలో ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. రెండు వారాల క్రితం డెల్టా స్టేట్‌లో ఫ్యూయల్‌ ట్యాంకర్‌ కోసం జరిగిన అల్లర్లలో ఐదుగురు మరణించారు. అదేవిధంగా గతేడాది అక్టోబర్‌లో పైప్‌లైన్ల నుంచి లీకవుతున్న పెట్రోల్‌ను పట్టుకోవడానికి జనాలు ఎగబడటంతో జరిగిన పేలుళ్లలో సుమారు 153 మంది మృతిచెందారు. నైజీరియాలో ఆర్థిక పరిస్థితులు అంతకంతకూ దిగజారడంతో గత 18 నెలల్లో చమురు ధరలు నాలుగు రెట్లు పెరిగాయి.

ట్రంప్‌నకు వ్యతిరేకంగా నిరసనలు

శ్వేత సౌధం ఎదుట వివిధ సంస్థల ర్యాలీలు

వాషింగ్టన్‌: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్‌ ట్రంప్‌ ప్రమాణ స్వీకారాణానికి ఓ పక్క ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతుండగా... ఆయన విధానాలను వ్యతిరేకిస్తూ వేలాది మంది నిరసనలకు దిగారు. శ్వేతసౌధం ముందు లాభాపేక్షలేని సంస్థలు... ముఖ్యంగా సఖి ఫర్‌ సౌత్‌ ఆసియాన్‌ వాసులు 'పీపుల్స్‌ మార్చ్‌' పేరుతో ర్యాలీ నిర్వహించాయి. ప్రమాణస్వీకరానికి ముందు వరుస వారాంతపు కార్యక్రమాల కోసం ట్రంప్‌ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. దీంతో ఆయనను వ్యతిరేకిస్తూ ఈ ర్యాలీలు నిర్వహించాయి. న్యూయార్క్‌, సీటెల్‌, చికాగో సహా అనేక ఇతర నగరాల్లోనూ ట్రంప్‌ వ్యతిరేక ర్యాలీలు జరిగాయి. నిరసనకారులు ట్రంప్‌ వ్యతిరేక పోస్టర్లు, బ్యానర్‌లను ప్రదర్శించారు. ట్రంప్‌తో టెస్లా యజమాని మస్క్‌ సహా అతని సన్నిహిత మద్దతుదారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూడు వేర్వేరు ప్రాంతాల నుండి ప్రారంభమైన నిరసనలు లింకన్‌ మెమోరియల్‌ వద్ద ముగిశాయి. ఫాసిజానికి తలవంచేది లేదని తెలిపేందుకు ఈ నిరసన చేపట్టామని పీపుల్స్‌ మార్చ్‌ సంస్థ తెలిపింది. పీపుల్స్‌మార్చ్‌ సంస్థ 2017లో ట్రంప్‌ మొదటిసారి అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టినపుడు కూడా ఆందోళన చేపట్టింది. సోమవారం కూడా ట్రంప్‌ ప్రమాణస్వీకారానికి ముందు ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లు లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు తెలిపారు. ట్రంప్‌ విధానాలు, ప్రణాళికలను నిరసనకారులు ఖండిస్తున్నారు. ఈ నిరసనలో ప్లాన్డ్‌ పేరేంట్‌ హుడ్‌, నేషనల్‌ ఉమెన్స్‌ లా సెంటర్‌ యాక్షన్‌ ఫండ్‌ వంటి సంస్థలు పాల్గొన్నాయి.

కేంద్ర సాయంతో ముందుకు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తొచ్చేది ఎన్డీఆర్‌ఎఫ్‌ అని చంద్రబాబు పేర్కొన్నారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, కార్చిచ్చు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో ఎన్డీఆర్‌ఎఫ్‌ రక్షణ చర్యలతో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. దేశంలో వచ్చిన విపత్తులతో పాటు 2011లో జపాన్‌, 2015లో నేపాల్‌, 2023లో టర్కీలో విపత్తులు వచ్చిన సమయంలో మన ఎన్డీఆర్‌ఎఫ్‌ సేవలందించిందన్నారు. 2014లో ఉత్తరాంధ్రలో వచ్చిన హుద్‌హుద్‌, ఇటీవల బుడమేరు వరదల సమయంలో ఎన్డీఆర్‌ఎఫ్‌ చేసిన సాహసోపేత సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. దేశంలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించేందుకు హోంమంత్రి అమిత్‌షా పట్టుదలతో పని చేస్తున్నారని, శాంతిభద్రతలు కాపాడటంలో వినూత్నంగా వ్యవహరిస్తున్నారని, కొన్ని సార్లు అమిత్‌షా పనితీరు చూస్తుంటే తనకు అసూయ కలుగుతోందన్నారు. అమిత్‌షా మనిషిలా కాకుండా మిషన్‌లా పని చేస్తున్నారని సీఎం పొగడ్తలతో ముంచెత్తారు. ఇలాంటి సమర్థవంతమైన హోంమంత్రిని మొదటిసారి చూస్తున్నానని కొనియాడారు. అవసరమైన సాంకేతికత వినియోగించుకోవడం, నియామకాలు చేపట్టడమొక్కటే కాకుండా విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో సూచిస్తున్నారని వివరించారు. దేశంలో ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని, సమర్థతతో పని చేస్తున్నారని చెప్పారు. అమిత్‌షాతో నేను ఎప్పుడు సమావేశమైనా వినూత్నమైన తన ఆలోచనలను పంచుకుంటారని, ఐదేళ్ల పాటు రాష్ట్రం చాలా విధ్వంసానికి గురైందని, ఎప్పటిలాగా కాకుండా వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలని నాకు సలహా ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, వాటికి వడ్డీలు కడుతూనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పునరుద్ఘాటించారు.

గత ప్రభుత్వ విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడాం: పవన్‌ కల్యాణ్‌

ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ మాట్లాడుతూ... ఎన్డీఆర్‌ఎఫ్‌ క్యాంపస్‌ రాష్ట్రానికి రావడం వరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రాంగణాన్ని సకల హంగులతో కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విశాఖపట్నంలో జరిగిన ఎల్జీ పాలిమార్స్‌ ఘటనలో, అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన అమ్మోనియా గ్యాస్‌ లీకేజీ దుర్ఘటనలో, విజయవాడకి అనుకోని విధంగా వరదలు ముంచెత్తిన సందర్భంలో... ఏ సమయంలో చూసుకున్నా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ స్పందించిన తీరు అమోఘమని కొనియాడారు. వికసిత్‌ భారత్‌ లో విపత్తుల నిర్వహణ కీలకమని స్పష్టంచేశారు. 2024 ఎన్నికల్లో గత ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే..రాష్ట్రంలో ఏ స్థాయి విపత్తు ఉండేదో ఊహించాలని... అలాంటి విపత్తు నుంచి రాకుండా రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడగలిగామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌ నాయుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ , కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీ అభివృద్ధి నా బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగిస్తూ...ఏపీలో కూటమికి మంచి విజయం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్డీఆర్‌ఎఫ్‌ 20వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎన్డీఆర్‌ఎఫ్‌ దక్షిణ సంస్థ కార్యాలయం అందుబాటులోకి తెచ్చామని అమిత్‌షా తెలిపారు. సీఎం చంద్రబాబు పాలన దక్షతతో పని చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని, ఆంధ్రప్రదేశ్‌ అభివృద్ధికి కేంద్రం పునరంకితమవుతుందని అమిత్‌ షా హామీ ఇచ్చారు. కేవలం గత ఆరు నెలల్లోనే రాష్ట్రానికి రూ. 3 లక్షల కోట్లను కేంద్రం విడుదల చేయడం... రాష్ట్ర అభివృద్ధి పట్ల తమ నిబద్ధతను నిరూపిస్తోందన్నారు. ఈ నిధులు విద్య, వైద్యం, ప్రాథమిక మౌలిక సదుపాయాల రంగాల్లో వినియోగించబడతాయని తెలిపారు. 2019-24మధ్య రాష్ట్రంలో జరిగిన అనేక మానవ తప్పిదాలు అభివృద్ధి తీరుపై ప్రభావం చూపాయని, అయితే ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొంటాయని అమిత్‌షా ఆశాభావం వ్యక్తం చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఎన్డీఆర్‌ఎఫ్‌ ఏ విధంగా రక్షిత కార్యక్రమాలు చేపడుతుందో... ఎన్డీఏ కూటమి కూడా ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను ఆదుకుంటుందన్నారు. విశాఖపట్నంలో ఇటీవల ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన గ్రీన్‌ హైడ్రోజన్‌ హబ్‌, అమరావతి లో ఎయిమ్స్‌ విస్తరణ వంటి ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి కీలకమని చెప్పారు. విశాఖ స్టీల్‌ ప్లాంట్‌ పునరుద్ధరణ ప్యాకేజీ ద్వారా ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే కేంద్రం లక్ష్యమని చెప్పారు. అమరావతికి కేంద్రం రూ.27వేల కోట్లను అందించామని అమిత్‌షా చెప్పారు. ఎయిమ్స్‌ను రూ.1600 కోట్లతో నిర్మిస్తున్నామని, లక్షా 20 వేల కోట్లతో జాతీయ రహదారులను నిర్మించనున్నామని చెప్పారు. ఏపీకి జీవధార అయిన పోలవరం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి 2028 నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచి నీరు ఇచ్చి తీరతామని అమిత్‌షా హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రం ఆర్థికంగా సుస్థిరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక అయిన ప్రత్యేక రైల్వే జోన్‌ను ఏర్పాటు చేశామని, ఇది రాష్ట్ర రవాణా వ్యవస్థకు నూతన శక్తిని అందిస్తుందని భరోసా ఇచ్చారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఆదుకునేందుకు రూ.11,440 కోట్లు కేంద్రం కేటాయించిందని అమిత్‌షా గుర్తుచేశారు.

విశాఖ స్టీల్‌ ప్లాంట్‌ విషయంలో ఆంధ్రుల ఆత్మగౌరవం ముడిపడి ఉందన్నారు. మొత్తంగా ఆంధ్రప్రదేశ్‌ అభివృద్ధి నా బాధ్యత అని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎన్డీఏ ఎల్లప్పుడూ మీతో ఉంటుందంటూ అమిత్‌ షా వ్యాఖ్యానించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఎన్డీఆర్‌ఎఫ్‌ ముందుంటుందని, గ్రామాల నుంచి కేంద్రం వరకు కలిసి పని చేస్తే వైపరీత్యాలను ఎదుర్కొనే అవకాశముందన్నారు. వ ఈ సందర్భంగా ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందం మొత్తానికి అమిత్‌షా అభినందనలు తెలిపారు.

రాహుల్‌ గాంధీపై ఎఫ్‌ఐఆర్‌ నమోదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదం ఉందన్నారు. 'ప్రతిపక్ష నాయకుడిగా ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్‌కు ఉంది. కానీ, ఆయన అందుకు బదులుగా అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు' అని చాటియా ఆరోపించారు. ఇటీవల దిల్లీలో కాంగ్రెస్‌ నూతన ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో రాహుల్‌... బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. దీన్ని కేంద్ర మంత్రులు తప్పుబట్టారు. కాంగ్రెస్‌ అసలురూపం బయటపడిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా అన్నారు.

ట్రంప్‌ అధ్యక్ష బాధ్యతల స్వీకారానికి సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

స్వీకార కార్యక్రమం జరగనుంది. దీంతో ఈ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దేశం నలుమూలల నుంచి వేల మంది రిపబ్లికన్‌ పార్టీ అభిమానులు వాషింగ్టన్‌ చేరుకున్నారు. అయితే ఇండోర్‌ ఆవరణలో ప్రమాణం కారణంగా గతంలో మాదిరిగా వేల మంది ప్రత్యక్షంగా ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేరు. వారంతా ఎక్కడికక్కడ సంబరాల్లో పాల్గొంటారు. అత్యంత ప్రముఖులు మాత్రం హాజరు కానున్నారు.

8 ఏళ్ల క్రితం ట్రంప్‌ తొలిసారిగా ప్రమాణం చేసినప్పుడు వేల మంది హాజరయ్యారు. కాగా ట్రంప్‌ ప్రమాణ స్వీకార సంబరాలు శనివారమే ప్రారంభమయ్యాయి. ఫ్లోరిడా నుంచి వర్జీనియాలోని స్టెర్లింగ్‌లో (వాషింగ్టన్‌ శివార్లలో) ఉన్న ట్రంప్‌ నేషనల్‌ గోల్ఫ్‌ క్లబ్‌కు చేరుకున్న ఆయన సాయంత్రం విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. అదే సమయంలో ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న జేడీ వాన్స్‌ వాషింగ్టన్‌లో కేబినెట్‌ సహచరులతో విందులో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం జరిగే సోమవారం సెయింట్‌ జాన్స్‌ ఎపిస్కోపల్‌ చర్చిలో ప్రార్థనలతో ట్రంప్‌ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి శ్వేతసౌధానికి వెళ్లి దిగిపోతున్న అధ్యక్షుడు బైడెన్‌, ఆయన సతీమణి ఇచ్చే తేనీటి విందులో పాల్గొంటారు. ఆ తర్వాత ప్రమాణ స్వీకారం చేసే క్యాపిటల్‌ హిల్‌కు వస్తారు. అక్కడ ప్రమాణం చేస్తారు. అనంతరం ప్రారంభోపన్యాసమిస్తారు. ఆ తర్వాత బైడెన్‌, కమలా హారిస్‌లకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎక్స్‌, టెస్లాల అధినేత ఎలాన్‌ మస్క్‌, అమెజాన్‌ వ్యవస్థాపకుడు జెఫ్‌ బెజోస్‌, మెటా సీఈవో మార్క్‌ జుకర్‌బర్గ్‌, టిక్‌టాక్‌ సీఈవో షౌ జీ చ్యూ హాజరవుతారు. ప్రమాణం చేశాక ప్రభుత్వ పరంగా కొన్ని కొన్ని కీలక ఆదేశాలపై ట్రంప్‌ సంతకాలు చేస్తారు. కాంగ్రెస్‌లో జరిగే విందులో పాల్గొంటారు. ఆ తర్వాత సాయుధ బలగాలపై సమీక్ష జరుపుతారు.

ట్రంప్‌ ప్రమాణ స్వీకారం జరగనున్న సోమవారం రోజున వాషింగ్టన్‌లో ఉష్ణోగ్రత మైనస్‌ 11 డిగ్రీల సెల్సియస్‌ ఉంటుందని వాతావరణ అంచనాలు వెలువడ్డాయి. కాగా ట్రంప్‌ ప్రమాణ స్వీకారోత్సవానికి క్యాపిటల్‌ హిల్‌పై దాడి చేసిన ఆయన మద్దతుదారులు హాజరుకానున్నారు. ఈ మేరకు వారు కోర్టు నుంచి అనుమతి తీసుకున్నట్లు సమాచారం.

లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి

రోజు రోజుకూ యువనేతకు పెరుగుతున్న మద్దతు

తాజాగా సోమిరెడ్డి, ఎస్వీఎస్‌ఎన్‌ వర్మ వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. తొలుత ఆ పార్టీ నేతలు ఈ వ్యాఖ్యలను సోషల్‌ మీడియా వేదికగా చేయగా... క్రమేపీ మంత్రులు, సీనియర్‌ నేతలు దానిని అనుసరిస్తున్నారు. టీడీపీ నేత మహాసేన రాజేశ్‌... సోషల్‌ మీడియాలో లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని అధిష్టానానికి సూచించారు. ఆ తర్వాత నుంచి ఒక్కొక్కరూ లోకేశ్‌కు మద్దతుగా మీడియాకు లీకులు ఇస్తున్నారు. టీడీపీ సీనియర్‌ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌ రెడ్డి ... పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి ప్రతిపాదనను తాను సమర్థిస్తున్నానని తెలిపారు. ఆ పదవికి లోకేశ్‌ వందశాతం అర్హులని అన్నారు. యువగళం పాదయాత్రతో తనలోని నాయకత్వ లక్షణాలను లోకేశ్‌ నిరూపించుకున్నారని కొనియాడారు. లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలంటూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్‌ఎన్‌ వర్మ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీ అధికారంలోకి వచ్చాక లోకేశ్‌కు సముచిత స్థానం కల్పించలేదన్న ఆవేదన ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. అయితే సీఎం చంద్రబాబు కేబినెట్‌లో అత్యధికంగా యువ ఎమ్మెల్యేలు, కొత్త వారే ఉన్నారు. వారంతా లోకేశ్‌కు అనుచరులుగా ఉన్న వాళ్లే. దీంతో భవిష్యత్‌లో సీఎం చంద్రబాబు తర్వాత నారా లోకేశ్‌ను సీఎం చేయాలన్న ఆశయంతోనే ఆ తరహాగా కేబినెట్‌ను కూర్చారన్న ప్రచారముంది. సీఎం చంద్రబాబు తర్వాత డిప్యూటీ సీఎంగా పవన్‌ కల్యాణ్‌ ఉన్నారు. ఆయనకు అత్యధికంగా పోర్టుపోలియోలను కేటాయించారు. మంత్రివర్గ సమావేశాల్లోను, ఇతరత్రా కార్యక్రమాల్లోను ప్రోటోకాల్‌ ఆధారంగా సీఎం తర్వాత... డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌కే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది.

ఇవన్నీ టీడీపీ శ్రేణులకు, ప్రధానంగా లోకేశ్‌ అనుచరులుగా ఉన్న వారికి ఇబ్బందిగా మారాయి. ఎప్పటికైనా పార్టీ పగ్గాలను లోకేశ్‌ స్వీకరించాల్సి ఉంటుందని, అందుకే ప్రస్తుతం లోకేశ్‌ సేవలను గుర్తించి ఆయనకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలంటూ తెరపైకి టీడీపీ శ్రేణులు ప్రతిపాదనలు తెస్తున్నారు. దీనిపై సీఎం చంద్రబాబుగాని, లోకేశ్‌గాని స్పందించలేదు. లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్లు రోజు రోజుకు పెరగడంతో కూటమి పార్టీలోని జనసేన, బీజేపీ శ్రేణుల్లో కొంత గందరగోళం ఏర్పడింది.

ఖోఖో ప్రపంచకప్‌ విజేత భారత్‌

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన ఖోఖో ప్రపంచకప్‌ లో 23 దేశాలు పాల్గొన్నాయి. మహిళల విభాగంలో జరిగిన ఫైనల్‌ మ్యాచ్‌ ఉత్కంఠభరితంగా సాగింది. ప్రియాంక ఇంగ్లే నేతృత్వంలోని భారత మహిళల జట్టు 78-40తో నేపాల్‌ను చిత్తు చేసింది. తుది పోరు టర్న్‌1లో భారత్‌ దూకుడుగా ఆడి 34-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. తర్వాత నేపాల్‌ పుంజుకోవడంతో 35-24తో రెండో టర్న్‌ ముగిసింది. మూడో టర్న్‌లో భారత్‌ జట్టు మళ్లీ దూకుడు పెంచి వరుసగా పాయింట్లు సాధించి ఆధిక్యాన్ని 49కి పెంచుకుంది. చివరి టర్న్‌లో నేపాల్‌ 16 పాయింట్లు సాధించడంతో 38 పాయింట్లతో భారత్‌ ఘన విజయం సొంతం చేసుకుంది.

పెట్టుబడులే లక్ష్యంగా...

(మొదటిపేజీ తరువాయి)

సంభాషణలు, చర్చలు బృందం జరిపింది. ఇండియన్‌ ఓషన్‌ గ్రూప్‌ ఫౌండర్‌, సీఈవో ప్రదీప్తో బిశ్వాస్‌, డీబీఎస్‌ కంట్రీ హెడ్‌ లిమ్‌ హిమ్‌ చౌన్‌, డీబీఎస్‌ గ్రూప్‌ హెడ్‌ అమిత్‌ శర్మ, బ్లాక్‌ స్టోన్‌ సింగపూర్‌ సీనియర్‌ ఎండీ, ఛైర్మన్‌ గౌతమ్‌ బెనర్జీ, బ్లాక్‌ స్టోన్‌ రియల్‌ ఎస్టేట్‌ సీనియర్‌ ఎండీ పెంగ్‌ వీ టాన్‌, మెయిన్‌ హార్డ్‌ గ్రూప్‌ సీఈవో ఒమర్‌ షాజాద్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్‌ లో పెట్టుబడులు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వారికి వివరించారు. మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రతినిధి బృందం... పెట్టుబడుల ఒప్పందాలతో పాటు సింగపూర్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నికల్‌ ఎడ్యుకేషన్‌(ఐటీఈ)తో తెలంగాణ యంగ్‌ ఇండియా స్కిల్‌ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోవటం కీలక పరిణామం. హైదరాబాద్‌ ఫ్యూచర్‌ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్‌ డేటా సెంటర్‌ ముందుకు వచ్చింది. రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌ లో భారీ ఐటీ పార్కు ఏర్పాటుకు క్యాపిటల్‌ ల్యాండ్‌ కంపెనీ నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.450 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేయనుంది. సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్‌ సెమీ కండక్టర్‌ ఇండస్ట్రీ అసోసియేషన్‌ తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

(మొదటిపేజీ తరువాయి)

పరిగణించడంతో సుమారు 17.26 లక్షల కుటుంబాలే పనిని పూర్తి చేసుకున్నాయని పేర్కొన్నారు. అయితే ఇందులో 11 లక్షల కు పైగా కుటుంబాలకు సొంత భూమి ఉండటంతో రైతు భరోసా లబ్దిదారులుగా ఉన్నారని, దీంతో ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి భూమి లేని ఆరు లక్షలకు పైగా ఉపాధి కూలీ కుటుంబాలుంటాయన్న అంచనాతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీరితో పాటు అర్హత ఉన్న అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని విస్తరిస్తామని తెలిపారు.గ్రామ సభల్లోనే, ప్రజల సమక్షంలోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారులు గుర్తించబడుతారని స్పష్టం చేశారు.

అమిత్‌షా రాజీనామా చేయాల్సిందే

అంబేద్కర్‌ను గౌరవించుకుంటూ రాజ్యాంగాన్ని కాపాడుకుందాం: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్‌): రాజ్యాంగ నిర్మాత బీఆర్‌ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. పార్లమెంట్‌ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలని వామపక్షాల శ్రేణులు డిమాండ్‌ చేశాయి. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్‌ బిఆర్‌ అంబేద్కర్‌ పై అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్‌ షా గో బ్యాక్‌ అంటూ వామపక్షాల ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌టిఆర్‌ జిలా మైలవరంలో, కృష్ణాజిల్లా మచిలీపట్నంలో, అనకాపల్లి నెహ్రూ చౌక్‌ వద్ద, బొబ్బిలిలో, ప్రకాశం జిల్లా కొండెపి మండలం ఆర్‌టీసీ బస్‌స్టాండ్‌ వద్ద, దొనకొండలో, అనంతపురం జిల్లా గుంతకలులో నిరసన కార్యక్రమాలు జరిగాయి. నంద్యాల జిల్లా నందికొట్కూరులో అమిత్‌ షా దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ధర్నా నిర్వహించారు. విజయవాడలో ధర్నా చౌక్‌ వద్ద సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్‌ అధ్యక్షతన "గో బ్యాక్‌ అమిత్‌ షా" అంటూ నినాదాలతో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ, మహనీయుడు డాక్టర్‌ బి.ఆర్‌ అంబేద్కర్‌ ను గౌరవించుకుంటూ, మనకందించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో లేని విధంగా, సాక్షాత్తు పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించే విధంగా దిగజారి మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌ షాతో వెంటనే రాజీనామా చేయించాలని, లేదా బర్తరఫ్‌ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్‌ చేశారు. స్వాతంత్ర్యోద్యమం, రాజ్యాంగం పైన, అంబేద్కర్‌పై గౌరవం, విశ్వాసం లేని బీజేపీ నాయకులు పదే పదే కించపరిచే విధంగా మాట్లాడటం దారుణం అన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంలో పార్లమెంటులో 400 స్థానాలు ఇస్తే, భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ సీనియర్‌ నాయకులు చాలా స్పష్టంగా ప్రకటించారని గుర్తు చేశారు. బిజెపి మాతృ సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్‌ 1949 నవంబర్‌ నెల ప్రచురించిన ఎడిషన్‌లో మాకు లౌకిక రాజ్యాంగం నచ్చదని, మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగం ఉండాలని, హిందూ మతప్రాతిపదికన దేశం నడవాలని చెప్పారన్నారు.

దేశమంతా అమిత్‌ షా వ్యాఖ్యలను ఖండిస్తుంటే, మన రాష్ట్రంలో అమిత్‌ షా వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌ రెడ్డి ఇప్పటివరకు ఖండించకపోవడం దారుణమన్నారు.

దిగొచ్చిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

అందజేసింది. ఈ సమావేశం ఫిబ్రవరి 14న చండీగఢ్‌లోని సెక్టార్‌-26లోని మహాత్మా గాంధీ స్టేట్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ పంజాబ్‌ (ఎంజీఎస్‌ఐపీఏ) లో జరుగుతుంది. దీనికి కేంద్ర, పంజాబ్‌ మంత్రులు హాజరవుతారు. 'ఇది ఫిబ్రవరి 15, 2024న చండీగఢ్‌లో జరిగిన ఎస్‌కేఎం (రాజకీయేతర), కిసాన్‌ మజ్దూర్‌ మోర్చా (కేఎంఎం) నాయకులతో జరిగిన మునుపటి సమావేశానికి కొనసాగింపుగా ఉంది' అని జాయింట్‌ సెక్రటరీ ప్రియరంజన్‌ లేఖలో తెలిపారు. గత సంవత్సరం ఫిబ్రవరి 8, 12, 15, 18 తేదీల్లో కేంద్ర మంత్రులు, నిరసన తెలుపుతున్న రైతుల మధ్య నాలుగు దఫాలుగా సమావేశాలు జరిగినప్పటికీ చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అప్పటి ముగ్గురు కేంద్ర మంత్రులు అర్జున్‌ ముండా, పీయూశ్‌ గోయల్‌, నిత్యానంద్‌ రాయ్‌ గత సంవత్సరం ఫిబ్రవరి 18న రైతుల ప్రతినిధులతో చర్చలు జరిపారు. కానీ అవి విఫలమయ్యాయి. సంయుక్త కిసాన్‌ మోర్చా (రాజకీయేతర) కన్వీనర్‌ అయిన దలేవాల్‌ తమ వివిధ డిమాండ్లకు మద్దతుగా గత ఏడాది నవంబరు 26 నుంచి పంజాబ్‌, హర్యానా మధ్య ఖనౌరి సరిహద్దు పాయింట్‌ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. దలేవాల్‌ అప్పటి నుంచి ఏమీ తినలేదని, కేవలం నీరు తాగుతూ బతుకుతున్నాడని రైతులు తెలిపారు. దలేవాల్‌ తన ఆమరణ నిరాహార దీక్ష సమయంలో దాదాపు 20 కిలోల బరువు కోల్పోయారని వివరించారు. ఆయన నీరు తాగడం తగ్గిందని, వాంతులు చేసుకుంటున్నారని కూడా వారు చెప్పారు. దలేవాల్‌ ఆరోగ్యం క్షీణించడం సుప్రీం కోర్టు దృష్టిని కూడా ఆకర్షించింది. ఇది ఆయన ఆసుపత్రిలో చేరడంపై నిర్ణయం తీసుకునే బాధ్యతను పంజాబ్‌ ప్రభుత్వ అధికారులు, వైద్యులపై ఉంచింది.

దలేవాల్‌కు వైద్య సహాయం

రైతులతో కేంద్రం చర్చలకు సంబంధించిన ప్రకటన వెలువడిన వెంటనే కేంద్రంతో చర్చల్లో చురుగ్గా పాల్గొనేందుకు వైద్యసాయం పొందాలని జగ్జీత్‌ సింగ్‌ దలేవాల్‌ను మిగిలిన రైతు నాయకులు కోరారు.

54 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తూ తీవ్రంగా నీరసించిపోయిన దలేవాల్‌ వైద్యసాయం పొందేందుకు అంగీకరించారు. అయితే పంటలకు కనీస మద్దతు ధరపై కేంద్రం నుంచి చట్టపరమైన హామీ వచ్చే వరకు జగ్జీత్‌ సింగ్‌ దలేవాల్‌ ఆమరణ నిరాహార దీక్ష ముగించరని మరో రైతు నేత సుఖ్‌జీత్‌ సింగ్‌ హర్దోజ్‌ హండే స్పష్టం చేశారు.

ప్రమాద రహితంగా కొత్తగూడెంను తీర్చిదిద్దుదాం

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యత పెరుగుతోందని వివరించారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు.

డీఎస్పీ అబ్దుల్‌ రహమాన్‌ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌ పాషా, తహసీల్దార్‌ పుల్లయ్య, ఆర్టీవో వెంకట పుల్లయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వర్‌ రావు, కమిషనర్‌ శేషాంజనస్వామి, ఆర్టీసీ డిపో మేనేజర్‌ వేందర్‌ గౌడ్‌, వార్డు కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, ఏఐటీయూసీ నేత వంగ వెంకట్‌, రమణమూర్తి, వి. మల్లికార్జునరావు, భూక్యా శ్రీనివాస్‌, ధర్మరాజు, పల్లపోతు సాయి, అబిద్‌, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్‌, రత్నకుమారి పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా నిబంధనలు సవరించండి

బీకెఎంయు ఆధ్వర్యంలో భట్టివిక్రమార్కకు వినతి

విశాలాంధ్ర - ఖమ్మం : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిబంధనలు సవరించాలని జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాలతో ముడిపెట్టి లబ్దిదారులను ఎంపిక చేయరాదని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం ఏన్కూరు మండల పర్యటనకు వచ్చిన భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత నిబంధనల ప్రకారం అనేక మంది అర్హులు లబ్దిదారులుగా ఎంపికయ్యే పరిస్థితి లేదని -తెలిపారు. సెంటు భూమి లేని వారు వేలాది మంది 20రోజులు పాటు జాతీయ ఉపాధి హామీ పథకం పనికి హాజరు కానివారు ఉన్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో సకాలంలో కూలీ డబ్బులు రానందున వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులకు వెళ్తున్నారని ఈవిషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పేదరికానికి ఉపాధి హామీ పని దినాలు కొలబద్ధ కాదని వెంకటేశ్వరరావు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన భట్టివిక్రమార్క పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, పెరుమాళ్లపల్లి ప్రకాషరావు, తలారి రమేష్ ఉన్నారు.

అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం : సంక్షేమ పథకాల సర్వే పారదర్శకంగా వేగవంతంగా నిర్దిష్ట వ్యవధిలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. అర్హులందరికీ ప్రభుత్వం ప్రవేశ రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందాలని చెప్పారు. ఫీల్డ్ వెరిఫికేషన్, గ్రామ సభలపై ఆదివారం అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యచందన, సీఈఓ నాగలక్ష్మి, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు వివిధ శాఖల అధికార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారుల సందేహాలను నివృత్తి చేసి సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈనెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీ రోజు ఒక గ్రామ పంచాయతీలో మాత్రమే గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ పథకాల ఎంపిక ప్రక్రియలో చివరి లబ్ధిదారుల వరకు అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డ్ల లబ్ధిదారుల జాబిత కులగణన (సామాజిక) సర్వే ఆదారంగా తయారు చేసిందని ఇది తుది జాబితా కాదని స్పష్టం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందన్నారు.

నేడు ప్రజావాణి రద్దు : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్: ఈనెల 26 నుండి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) సంబంధించి ఇంటింటి సర్వే నేపథ్యంలో జిల్లాలోని అధికారులందరూ క్షేత్రస్థాయి పరిశీలనలో నిమగ్నమై ఉన్నందున సోమవారం (ఈనెల 20న) ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించగలరని కోరుతూ, సోమవారం రోజు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయానికి వినతులతో రావొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రూ.కోటి ప్రమాద బీమా, డిపెండెంట్ ఉద్యోగాలు సాధించాం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమాతో పాటు ఉద్యోగుల పిల్లల డిపెండెంట్ ఉద్యోగ వయో పరిమితి 35 ఏళ్ళ నుంచి 40 ఏళ్ళ వరకు సాధించామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్ట దయానంద్, ఐ.ఎన్.టి.యు.సి కేంద్ర కమిటీ నాయకులు సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ పాల్గొన్నారు. ఆదివారం సత్తుపల్లి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆధ్వర్యంలో సత్తుపల్లి ఐఎన్టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులు గా దయానంద్, త్యాగరాజన్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తమ యూనియన్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారాలతో సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల కోసం అనేక పథకాలు సాధించి పెట్టినట్లు వివరించారు. ప్రైవేట్ ఓబీ రిమూవల్ కంపెనీలలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు, సింగరేణిలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు పండుగ అడ్వాన్స్ ఇప్పించామన్నారు. అప్రెంటిస్ ట్రైనింగ్ ఉద్యోగులకు ఎక్కడి వారికి అక్కడే ట్రైనింగ్ ఇచ్చే విధంగా యాజమాన్యాన్ని ఒప్పించామని తెలిపారు. అనంతరం ఐఎల్‌టియుసి యూనియన్ సెంట్రల్ కమిటీలో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్‌ను ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను సన్మానించారు. జనరల్ సెక్రెటరీ అల్బర్ట్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, రావి నాగేశ్వరరావు, పోశం శ్రీనివాస్, కొమురయ్య, ప్రసన్న, రామారావు బాలాజీ నాగేశ్వరరావు, చెన్నకేశవరావు, సీతారాం, కోటి, దావూద్, పొట్టి కిరణ్, రెడ్డి, రాజు శ్రీధర్, బాషా, నజీర్, యాకుబ్, బాలకృష్ణ, సురేష్, మురళి పాల్గొన్నారు.

ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదు

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి : సింగరేణి ఓసిపి 5 యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసి ఉప ప్రధాన కార్యదర్శి మద్దీ ఎల్లయ్య అన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓసిపి 5లో ట్రేనింగ్ లేని ఆపరేటర్‌లతో వాల్వోలను ట్రక్కులను నడిపించి కార్మికుల ప్రమాదానికి ఓసిపి 5 అధికారులు కారణమయ్యారని ఆరోపించారు. ఓసిపి 5 లో అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడని, ఆరోపించారు. టెక్నీషియన్స్ లేకుండా యంత్రాల రిపేర్ పనులు మజ్దూర్లతో చేయించుతున్నారని, వారు ప్రమాదాలకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. ఓసిపి 5 యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారం లో గుర్తింపు సంఘం సూచనలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, గుర్రం ప్రభుదాస్, గండి ప్రసాద్, ఉదయభాను, మాదిరెడ్డి శ్రీధర్, మానాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ దర్గా ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : సూర్యాపేట జిల్లా పరిధిలోని పాలకీడు మండల జాన్ పహాడ్ దర్గా ఉర్సు ఏర్పాట్లపై ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాల జాబితాలో పేరు లేకపోయినా కూడా ఈ నెల 21 నుంచి జరిగే గ్రామ సభలలో తమ దరఖాస్తు అందజేయవచ్చు అని తెలిపారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులను మరిచిందని ఇప్పుడు మేము 40 లక్షల మందికి సౌకర్యం కలిగేలా రేషన్ కార్డులు అందిస్తున్న ఈ కార్యక్రమం 24న మొదలై అర్హులైన చివరి వ్యక్తి వరకు కార్డు అందిస్తామని తెలిపారు. 90 లక్షల రేషన్ కార్డులకు ద్వారా రెండు కోట్ల 81 లక్ష మందికి 6 కేజీల బియ్యం చొప్పున అందించామని గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్యాబినెట్ మంత్రులతో దేశ చరిత్రలోనే నిలిచిపోయేటట్లుగా అర్హులైన అందరికీ రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వమే తెలిపారు. జాన్ పాడ్ దర్గా అంటే తమకు భక్తీ భావాలు ఎక్కువ అని ఈ గ్రామ వాసి మల్లయ్య గతంలో ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు రోడ్డు వేయాల్సిందిగా అడగగా శాసన సభ్యులు నిధులతో రోడ్డు వేయడం జరిగిందని ఈ జాన్పాడుదర్గాకు దేశ దేశాల నుండి రాష్ట్రాల నుండి హిందువులు ముస్లింలు లక్షలాది మంది తమ మొక్కులను తీర్చుకుంటారని గతంలో జానపాడు దర్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని మరల ఉరుసు ఉత్సవాలకు అభివృద్ధి కొరకు ఒక కోటి 30 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు .జాన్పాడుకు సబ్‌స్టేషన్ రోడ్లు నీటివసి అలాగే త్వరలో ప్యాసింజర్ రైలు నడిచే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు జానపద దర్గా ఉరుసు కంటే ముందుగా వచ్చి ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు మరిన్ని సేవలందించడానికి వచ్చినట్లు మంత్రి తెలిపారు జాన్పాడు లిఫ్ట్‌కు జవహర్ జాన్ జాన్ పాడు లిఫ్ట్‌గా నామకరణం చేసినట్లు మంత్రి తెలిపారు జోహార్ జానపాడు లెఫ్ట్‌కు 173 కోట్లు మంజూరు చేయడం జరిగిందని దీని ద్వారా 5650 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుంది అని తెలిపారు. పంపు హౌస్ పనులు జరుగుతున్నాయని ఈ లిఫ్టు కొరకు 34 ఎకరాలు భూసేకరణ పూర్తయిందని రెండు కోట్ల 59 లక్షలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి...

విశాలాంధ్ర - గార్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్కౌంటర్ల ద్వారా విప్లవ పార్టీల నాయకులను హతమారుస్తున్నారని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఆరోపించారు. సిపిఐ (మావోయిస్టు) రాష్ట్ర కార్యదర్శి దామోదర్ అలియాస్ బడే చొక్కారావు తోపాటు 17మందిని చత్తీస్ ఘడ్ బీజపూర్ జిల్లాలోని అడవుల్లో కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్కౌంటర్ తో హత్య గావించిందన్నారు. బూటకపు ఎన్కౌంటర్లను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఎన్కౌంటర్ల పేర జరిగే హత్యలు తక్షణమే నిలుపుదల చేయాలనీ, దామోదర్ ఎన్కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. పాలకుల తాబేదారులైన కార్పొరేట్ కంపినిలకు అడవుల్లోని సహజ సంపద, గనులు, ఖనిజాలను దోచి పెట్టేందుకే ఈ బూటకపు ఎన్కౌంటర్లను జరుపుతున్నట్లు ఆరోపించారు. బడా బుర్జువా, నిరంకుశ, దోపిడీ శక్తులకు ఊడిగం చేస్తూ అటవీ సంపదను కోళ్లగొట్టే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజల హక్కుల కోసం పోరాడే నాయకులపై కాల్పులు జరిపి హత్య చేయడం దుర్మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వ నాయకులు స్వదేశీ జపం చేస్తూ, విదేశీ కంపెనీలతో, స్వదేశి పెట్టుబడిదారులను ఏకం చేసి కార్పొరేట్ శక్తులతో చేతులు దేశ సంపదను దోచుపెడుతుందని ఆరోపించారు. బీజేపీ పార్టీ శ్రీరాముడి నామం పేరుతో ప్రజలను దారిమళ్లించి, హిందుత్వం పేరుతో దేశంలోని ప్రజల ఐక్యతను దెబ్బతీస్తూ కులాల మధ్య చిచ్చు పెడుతున్నట్లు ఆరోపించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశాన్ని గందరగోళంలోకి నెట్టి దేశ సంపదను అదాని, అంబానీలకు టోకుగా కట్టబెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను దేశ ప్రజలు ఏకమై ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు.

తిరుమల శ్రీవారి సేవలో సింగరేణి మండల వాసులు

విశాలాంధ్ర - కారేపల్లి : తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా కార్యక్రమాలలో సింగరేణి మండల వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. సేవా టీం లీడర్ పగడాల నాగేశ్వరరావు నాయకత్వంలో పదిమంది సేవకులు తిరుమల తరలివెళ్లి ఈనెల 15 నుండి వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. శ్రీవారి ప్రధానాలయంలో ఆదివారం సేవా విధులు నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకున్నట్లు సేవకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర సంక్రాంతి పర్వదినం నాడు తిరుమలలోని స్వామి వారి సన్నిధిలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఈ సేవా కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఏపూరి లక్ష్మీనారాయణ, తేళ్ల శ్రీనివాసరావు, వ్యాపారవేత్త పిల్లి వెంకటేశ్వర్లు, పాయం రామకృష్ణ, కొలిశెట్టి శ్రీనివాసరావు, నున్న నరసింహారావు, ముక్తి రామారావు, చాట్ల శ్రీనివాస్ రెడ్డి, పరిటాల సత్యనారాయణలు పాల్గొన్నారు.

రైతులను బలి పశువులు చేయకండి : కొండపర్తి

విశాలాంధ్ర - ఖమ్మం : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా రైతులను బలుపశులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవింద రావు జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వాలను హెచ్చరించారు. ఆదివారం గుడ్డుగొర్ల శ్రీను అధ్యక్షులు జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం చిన్న గోపతి గ్రామ శాఖ మహాసభలో వారు పాల్గొని ప్రసంగించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వ పరి పాలకులు రైతులు పట్ల సవితి తల్లి ప్రేమను వలబోస్తున్నారని వారు ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా బడ్జెట్లోలో వ్యవసాయ రంగానికి 50 శాతం నిధులు కేటాయించాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చీడ పీడ అనేక వైరస్లు అకాల వర్షాలు తుఫానులు వచ్చి పంటలను నష్టం జరిగి రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల భీమా పథకం ఏర్పాటు చేసి తక్షణమే అమలు చేయాలని కోరారు. రైతులకు ఆరోగ్య భద్రత వృద్ధాప్యపెన్షన్ కల్పించాలని పంట పొలాలకు రహదారుల సౌకర్యం కల్పించా లని బ్యాంకు నుంచి పంట పెట్టుబడి కోసం ఎకరానికి 2 లక్షల రూపాయలు చొప్పున పావలా వడ్డీ మీద రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాలను వారు కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు రైతు సంఘం మండల నాయకులు దేరంగుల లక్ష్మయ్య పొట్లపల్లి వెంకటేశ్వర్లు బండారు కోరువీరు తదితరులు పాల్గొన్నారు మహాసభ ముందుగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రతాకాన్ని జిల్లా ఉపాధ్యక్షులు తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. మహాసభ లో గ్రామ రైతు సంఘం అధ్యక్షుడిగా గుడ్డు గొర్ల శ్రీను ప్రధాన కార్యదర్శి దేరంగు లక్ష్మయ్య తోపాటు 11 మంది కమిటీ సభ్యులను మహాసభ ఎన్నుకున్నది.

సేవే లక్ష్యంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆవిర్భావం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : మానవ సేవయే మాధవసేవ అనే నానుడితో సేవే లక్ష్యంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆవిర్భ వించిందని ఇంటర్నేషనల్ సెక్రటరీ బోద సాయి సూర్యప్రకాష్ అన్నారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చారిత్రాత్మక బృగు మాలిక సోమప్ప సోమేశ్వరస్వామి ఆలయంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ శ్రీకర ఉత్సవం ఆదివారం జరిగింది. 104 జిల్లా క్యాబినెట్ సమావేశానికి జిల్లా గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ సెక్రెటరీ బోధ సాయి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ 1961 అక్టోబర్ 1న ప్రారంభమైన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నేడు లక్ష మంది సభ్యులతో 25 దేశాలలో 31 వాసవి జిల్లాలలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించిందన్నారు. 2025 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన అందరూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నుండి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆర్యవైశ్య కుటుంబాలను ఆదుకుంటూ ప్రజల మన్ననలు పొందాలని కోరారు. జిల్లా గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీలందరూ అద్భుత ప్రతిభ పాటవాలతో వాసవి క్లబ్‌కు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. నూతనంగా ఎన్నికైన 31 క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

విద్యార్థులను ఎన్‌సీసీ కార్ప్స్ దృఢంగా తీర్చిదిద్దుతోంది

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థ విద్యాలయాల్లో ఎన్సిసి కార్ప్స్ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేలా తీర్చిదిద్దుతుందని సంస్థ విద్యాశాఖ కార్యదర్శి గుండా శ్రీనివాస్ అభినందించారు. ఆదివారం ఆయన ఆనందఖని ప్రభుత్వ పాఠశాలలో ఎన్సిసి ఎ సర్టిఫికేట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌కె.భద్రతో పాటు క్యాడెట్‌లతో సంభాషించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరీక్షలో కొత్తగూడెం, యెల్లందు, మణుగూరులోని సింగరేణి పాఠశాలల క్యాడేట్లు పాల్గొంటున్నారని శ్రీనివాస్ చెప్పారు. క్యాడెట్లను చైతన్యపరిచే విధంగా స్ఫూర్తిదాయకమైన అంశాలు వారికి బోధించారు. ఆఫీసర్ భద్ర విద్యార్థులను సమర్థులుగా తీర్చిదిద్దడానికి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా శ్రీనివాస్ కొనియాడారు. సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో ఎన్‌సిసి ప్రారంభించడానికి ఆయన ప్రతిపాదనను సమర్పించారు. సింగరేణి విద్యాసంస్థలకు చెందిన ఎన్‌సిసి ఉపాధ్యాయులు కె.శ్రీలత, సిహెచ్ ప్రశాంత్, రాజసింహ, రాజాగౌడ్‌లను కార్యదర్శి అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు సర్టిఫికెట్ పరీక్ష రాస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డి పూల్ సింగ్, కొత్తగూడెం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫలాలు జిల్లాలోని అర్హులందరికీ అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి కాగజ్ నగర్ డివిజన్ తహసిల్దార్లు, మండల వ్యవసాయ శాఖ అధికారులతో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో భాగంగా జిల్లాలో వ్యవసాయ సాగుకు యోగ్యం గల ప్రతి రైతుకు పథకం అందించాలని, సాగుకు యోగ్యం కానీ రాళ్లు, గుట్టలు, నివాస గృహాలు, వెంచర్లు, లే అవుట్లు, అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూములు, ఇరిగేషన్ భూములు, చెరువులు, కాలువలు, రహదారులు, రైల్వే లైన్ల కోసం కేటాయించిన భూములను రైతు భరోసా జాబితా నుండి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితా రూపొందించాలని అర్హత గల ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగజ్ నగర్ ఎన్జీవోస్ కాలనీలో రేషన్ కార్డుల ఎంక్వైరీ తీరును పరిశీలించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : సీఐ

విశాలాంధ్ర - పినపాక : వాహనదారుల తోపాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతల మాసోత్సవాల్లో భాగంగా సీఐ సారథ్యంలో క్రాస్ రోడ్ సెంటర్ నుండి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హేచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయి కుటుంబాలను అనాథలుగా చేస్తున్నారని విచారం వ్యక్తం చేసారు. ప్రతి ఒక్కరు హెల్మెంట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్సూర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి కొత్త ఆసరా పింఛన్లు ఇవ్వాలి

విశాలాంధ్ర-వనపర్తి: కొత్త ఆసరా పింఛన్లు, మహిళకు రూ. 2500 జనవరి 26 నుంచి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి సిపిఐ జిల్లా ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు అమలు చేస్తామని ప్రకటించింది అన్నారు. వితంతువులు వికలాంగులు వృద్ధులు ఆసరా పింఛన్ కోసం చేసుకున్న దరఖాస్తులు మూడేళ్లుగా పెండింగులు ఉన్నాయన్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేసి జనవరి 26 నుంచి వికలాంగులకు రూ. 6000, ఇతరులకు రూ. 4000 పింఛన్ ఇవ్వాలన్నారు. మహిళకు రూ. 2500 ఇస్తామన్న హామీని ఈనెల నుంచే అమలు చేయాలన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం మొదటి విడతలో 3500 ఇండ్లు కేటాయించిందని, ఇవి ఏ మూలకు సరిపోవని 5000 లకు పెంచాలన్నారు.

హ్యుందాయ్ మోటార్, టీవీఎస్ మోటార్ కంపెనీల భాగస్వామ్యం

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ కంపెనీ (హ్యుందాయ్ మోటార్) తాజాగా భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో అధునాతన ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ మరియు మైక్రో ఫోర్-వీలర్ కాన్సెప్ట్ మోడళ్లను ఆవిష్కరించింది. టీవీఎస్ మోటార్ కంపెనీ లిమిటెడ్ (టీవీఎస్ మోటార్)తో కలిసి, హ్యుందాయ్ మోటార్ భారతదేశంలో చివరి-మైల్ మొబిలిటీ మార్కెట్‌కు సహకారాలను అన్వేషిస్తోంది. భారతదేశ డైనమిక్ రవాణా రంగంలో భాగంగా సౌలభ్యం, స్థిరత్వం, అనుకూలతకు ప్రాధాన్యతనిచ్చే మొబిలిటీ సొల్యూషన్‌లను తిరిగి ఊహించుకోవడం ద్వారా 'మానవత్వం కోసం పురోగతి' అనే దాని దార్శనికతకు హ్యుందాయ్ మోటార్ అచంచలమైన నిబద్ధతను ఈ వినూత్న భావనలు నొక్కి చెబుతున్నాయి. ఎటువంటి బైండింగ్ ఒప్పందాలు అన్వేషించబడలేదు లేదా అమలు చేయబడలేదు, హ్యుందాయ్ మోటార్ డిజైన్, ఇంజనీరింగ్ మరియు సాంకేతికతను అందించే సామర్థ్యాన్ని అన్వేషిస్తోంది, అయితే %ంయా% మోటార్ వాహనాల తయారీ మరియు మార్కెటింగ్‌ను అన్వేషిస్తుంది.

మహా కుంభమేళాలో కోకా-కోలా ఇండియా మైదాన్ సాఫ్ చొరవలు

న్యూఢిల్లీ: కోకా-కోలా ఇండియా, దాని ఫౌండేషన్ ఆనందన, మహా కుంభ్ 2025లో స్థిరత్వ కార్యక్రమాలకు నాయకత్వం వహించడానికి పీహెచ్‌డీ గ్రామీణాభివృద్ధి ఫౌండేషన్ (పీహెచ్‌డీఆర్‌డీఎఫ్), ప్రయాగ్‌రాజ్ మేళా అథారిటీతో కలిసి పనిచేశాయి. ఈ సహకారం వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ కోసం వినూత్న పరిష్కారాలను ప్రోత్సహించడం ద్వారా సామాజిక, పర్యావరణ ప్రభావాన్ని సృష్టించడంపై దృష్టి పెడుతుంది. మైదాన్ సాఫ్ ప్రచారంలో భాగంగా, కంపెనీ పారిశుధ్య కార్మికులు, బోట్‌మెన్, వ్యర్థాల నిర్వహణ వాలంటీర్ల కోసం 21,500 రీసైకిల్ చేయబడిన పెట్ (పీఈటీ) జాకెట్‌లను సృష్టించి పంపిణీ చేసింది. ఇందులో స్వచ్ఛకుంభ్ చొరవలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు 10,000 జాకెట్లు, నది దాటే సమయంలో సురక్షితంగా ఉండటానికి 4000 పడవల్లో బోట్ మెన్లకు 10,000 లైఫ్ జాకెట్లు, వ్యర్థాల నిర్వహణపై పనిచేస్తున్న స్వచ్ఛంద సేవకుల కోసం 1,500 జాకెట్లు ఉన్నాయి. ఈ జాకెట్లు కార్మికుల భద్రత మరియు సులభంగా గుర్తింపును నిర్ధారిస్తాయి. అదే సమయంలో రీసైకిల్ చేయబడిన ప్లాస్టిక్ పరివర్తన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి, సందర్శకులు వ్యర్థాల ఉపయోగాలు మరియు దాని అవకాశాల గురించి పునరాలోచించమని ప్రోత్సహిస్తాయి.

భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ఐషర్ ప్రో ఎక్స్ శ్రేణి ఆవిష్కరణ

న్యూఢిల్లీ: ఈ కమర్షియల్ వెహికల్స్ విభాగం అయిన ఐషర్ ట్రక్స్ అండ్ బస్‌లు, భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో దాని ఎలక్ట్రిక్-ఫస్ట్ శ్రేణి స్మాల్ కమర్షియల్ వెహికల్స్ (ఎస్‌సీవీలు) అయిన ఐషర్ ప్రో ఎక్స్ శ్రేణిని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ విప్లవాత్మక శ్రేణి వేగంగా అభివృద్ధి చెందుతున్న 2-3.5టీ విభాగంలోకి ఐషర్ వ్యూహాత్మక ప్రవేశాన్ని సూచిస్తుంది, చివరి-మైల్ లాజిస్టిక్స్ పరివర్తన ద్వారా భారతదేశం వృద్ధి ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి కంపెనీ నిబద్ధతను మరింత నొక్కి చెబుతుంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వీఈ కమర్షియల్ వెహికల్స్ లిమిటెడ్ ఎండీ, సీఈవో వినోద్ అగర్వాల్ మాట్లాడుతూ, లైట్, మీడియం డ్యూటీ ట్రక్కులలో మా మార్కెట్ నాయకత్వ వారసత్వాన్ని, ట్రాక్ రికార్డ్‌ను ఉపయోగించి ఈ అత్యుత్తమ శ్రేణి వాహనాలను సృష్టించామని తెలిపారు.

దేశంలో తొలి మెటా క్యాంపస్‌ను ప్రారంభించిన పెర్ల్ అకాడమీ

బెంగళూరు: భారతదేశంలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో భాగంగా చేపట్టిన ఒక విప్లవాత్మక చర్యలో, దేశంలోని ప్రముఖ సృజనాత్మక విద్యా సంస్థలైన పెర్ల్ అకాడమీ, భారతదేశపు మొట్టమొదటి మెటా క్యాంపస్‌ను కామిక్ కాన్ బెంగళూరు 2025లో ప్రారంభించింది. ఈ కార్యక్రమం, సంస్థ 32 సంవత్సరాల వారసత్వంలో ఒక చారిత్రాత్మక మైలురాయిని సూచిస్తుంది. పూర్తిగా లీనమయ్యే వర్చువల్ వాతావరణంలో సృజనాత్మకతతో అత్యాధునిక సాంకేతికతను అనుసంధానించడం ద్వారా విద్య యొక్క సరిహద్దులను మరింత విస్తరిస్తుంది. పెర్ల్ 2.0 మెటా క్యాంపస్ విద్యా అనుభవాన్ని అపూర్వమైన శిఖరాలకు తీసుకెళుతుంది, సందర్శకులకు సంస్థ విభిన్న ఆఫర్‌లను అన్వేషించే అవకాశాన్ని అందిస్తుంది. క్యాంపస్‌లో అందించే కార్యక్రమాలు, అధ్యాపకుల పరిచయం, విద్యార్థుల ప్రాజెక్ట్ ప్రదర్శన, విద్యార్థుల అనుసంధానిత కార్యక్రమాలు, మరెన్నో ఉన్నాయి - అన్నీ భవిష్యత్ మెటావర్స్‌లో భాగంగా ఉంటాయి. ఇది కేవలం క్యాంపస్ కాదుబీ ఇది ఒక అనుభవం, విద్యా ప్రపంచంలో మనం ఎలా నేర్చుకుంటాము, నిమగ్నం అవుతాము మరియు సంభాషిస్తాము అనే దానిని మార్చడానికి రూపొందించబడింది.

కోటక్ నికర లాభం రూ.4,701 కోట్లు

ముంబయి: ప్రైవేటు రంగ కోటక్ మహీంద్రా బ్యాంకు డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.4,701 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌తో పోలిస్తే లాభం 10% పెరిగింది. టర్నోవర్ రూ.13,507 కోట్ల నుంచి రూ.16,050 కోట్లకు చేరింది. వ్యయాలు రూ.9,530 కోట్ల నుంచి రూ.10,869 కోట్లకు పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం రూ.7,196 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.6,554 కోట్లతో పోలిస్తే ఇది 10% అధికంగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ 5.22% నుంచి 4.93 శాతానికి దిగివచ్చింది. స్థూల ఎన్‌పీఏలు 1.49% నుంచి 1.50 శాతానికి పెరిగాయి. రాని బాకీల కోసం చేసిన కేటాయింపులు రూ.579 కోట్ల నుంచి రూ.794 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయాలు 14% వృద్ధి చెంది రూ.2,623 కోట్లుగా ఉంది.

భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ కొత్త మోడళ్లు ఆవిష్కరణ

ముంబయి: జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా, దాని డ్రైవ్ ఫ్యూచర్ విజన్‌కు అనుగుణంగా, భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 2వ రోజున అత్యాధునిక సాంకేతికతలు, ఫార్వర్డ్-థింకింగ్ కార్యక్రమాలను ప్రదర్శించింది. దాని సాంకేతిక నైపుణ్యాన్ని హైలైట్ చేస్తూ, కంపెనీ కేస్ (సీఏఎస్‌ఈ) (కనెక్ట్, అటానమస్, షేర్డ్ మరియు ఎలక్ట్రిక్) టెక్నాలజీలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఆవిష్కరణ, స్థిరత్వం, కస్టమర్-కేంద్రీకృత కార్యక్రమాలపై దృష్టి సారించి, జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా ఆధునిక ప్రపంచానికి మొబిలిటీని పునర్నిర్వచించే లక్ష్యంతో ఆచరణాత్మక పురోగతిని అందించింది. దాని డ్రైవ్ ఫ్యూచర్ విజన్‌ను తదుపరి స్థాయికి తీసుకెళుతూ, జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా విభిన్న పవర్‌ట్రైన్ ఎంపికలను ఆవిష్కరించింది. అందులో హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలు (హెచ్‌ఈవీలు), ప్లగ్-ఇన్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలు (పీహెచ్‌ఈవీలు), బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు (బీఈవీలు), అంతర్గత దహన ఇంజన్ మోడల్‌లు ఉన్నాయి.

గడువు లోగా సర్వే పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : కడం మండలంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న పథకాల గుర్తింపు సర్వే తీరును ఆదివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పరిశీలించారు. మండలంలోని పెద్దూరు గ్రామ పరిధిలోని 69, 70, 71 సర్వే నెంబర్లలో సాగుకు యోగ్యం కాని 87 ఎకరాలను గుర్తించి రైతుబంధు పథకం నిలిపివేసినట్టు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, పథకాల లబ్ధిదారుల గుర్తింపు సర్వేను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గ్రామంలో నూతన ఆహార భద్రత కార్డుల లబ్ధిదారుల ఎంపిక క్షేత్రస్థాయి సర్వేలు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించి, నిర్ణీత గడువులోగా లబ్ధిదారుల ఎంపిక సర్వే పూర్తి చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ పలుకికలకు సూచనలు చేశారు.

కాంతి

హిందీ మూలం: డా॥ మహేంద్ర భటనాగర్

మనిషి భవిష్యత్–
అంధకారము నుంచి,
ప్రచ్ఛన్న యుద్ధ భయం నుంచి, ముక్తి పొందాలి
విమల వివేకపు కిరణాలు, నలువైపులా ప్రసరించాలి
వికాసాన్ని ఆపే శక్తులు విచ్ఛిన్నమైపోవాలి
వర్ణ వివక్షత నుంచి మనిషి, మనిషి చెర నుంచి,
ముక్తి పొందాలి ముక్తి పొందాలి!!
సుడిగాలి, ధూళి దుమారం, పిడుగుపాట్లు
సరికొత్త మానస క్షితిజాన్ని చుట్టెయ్యకూడదు!
కొత్త సమాజ శిఖరం, కూలిపోకూడదు,
కూలిపోకూడదు!
పవిత్రమైన దివ్యసాధన

విశ్వశాంతి కోరిక
ఉషస్సులా భూమిని అలంకరించాలి
భయపడిన జగత్తుని రక్షించాలి!
ప్రేమతో లాలించాలి!
కొత్త భావం పుప్పొడి మాడిపోకూడదు
కుమిలి పోకూడదు!
ఎన్నో విషపు అస్త్ర–శస్త్రాల ప్రహారంతో
అసహ్యము అనే రాక్షసి నుంచి
మన సభ్యత
ముక్తి పొందాలి!

తెలుగు అనువాదం: పారనంది నిర్మల
సెల్: 9985103804

సాహితి

నూరేళ్ల వినోద గీతిక 'ఫస్ట్ రీల్'

'ఫస్ట్ రీల్' నూరేళ్ల వినోద గీతిక. మన దేశంలో మూకీ, టాకీ సినిమా పుట్టిన తర్వాత వచ్చిన సినిమాలు, వాటి వివరాలు, నటీనటుల వివరాలను పరిశోధించి సేకరించి రెంటాల జయదేవ మనకు అందించారు. బహుశా తెలుగులోనే గాక ఇంగ్లీషులో దక్షిణ భారతదేశంలో మళయాళం, తమిళం, కన్నడ సినిమాలలోని అత్యంత ముఖ్యమైన, అరుదైన సినిమాల వివరాలను శోధించి ఇవ్వడం జయదేవకు గల ఆసక్తిని, చేసిన కృషిని అభినందించవలసిందే. తెలుగులో వచ్చిన మొదటి సినిమా 'కాళిదాస', 'భక్త ప్రహ్లాద' ఏది అని పరిశోధన చేసి 'కాళిదాస' అని, అది విడుదల తేదీని కూడా ఆయనే నిర్ధారించగలిగారు. దాదాపు శతాబ్ది క్రితం ఫ్యూచర్ ఫిల్మ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే 'రాజా హరిశ్చంద్ర' మూకీ సినిమాకు 1913 లోనే నాంది పలికారని శోధించి ఇలాంటి అనేక అరుదైన సినిమాల వివరాలు మనం తెలుసుకోగలుగుతాము.

సినిమా నిర్మాణం తొలత పాశ్చాత్య దేశాల్లో ముందుగా ప్రారంభమైన తర్వాత భారతదేశానికి వచ్చే నాటికి సినిమా రంగంలో ఎన్నో మార్పులు జరిగాయి. సినిమా స్వరూప, స్వభావాలు మారాయి. మూకీ సినిమా పాశ్చాత్య దేశాల్లో పుట్టింది. దక్షిణ భారతదేశంలో టాకీలు రావడానికి హెచ్ఎం రెడ్డి ఎనలేని కృషి చేశారు. 1931 లో దక్షిణ భారతదేశంలో టాకీ చిత్రాల నిర్మాణం ప్రారంభమయ్యాయి. ఆనాటి నుంచి వచ్చిన టాకీ చిత్రాలు అన్నింటి వివరాలను రచయిత జయదేవ మనకు అందించారు. ఇంతటి లోతైన, విపులమైన వివరాలను అందించడానికి చేసిన శ్రమను ప్రశంసించాలి. తెలుసుకోవాలన్నా అలనాటి సినీ నటులు పేర్లు, వారు నటించిన చలన చిత్రాలను, అరుదైన సినిమాల పోస్టర్ల బొమ్మలను సమీకరించి ఈ పుస్తకంలో ముద్రించడం చాలా కష్టంతో కూడినది. తెలుగులో అరుదైన సమాచారాన్ని మరెవరూ పరిశోధించలేదని జయదేవకు ఆ ఖ్యాతి దక్కిందని భావిస్తున్నాను. పరిశోధనకు కొన్ని సంవత్సరాలు పట్టి ఉంటుంది. అత్యంత పట్టుదల గల పరిశోధకుడని కచ్చితంగా అంచనా వేయాలి. ఆనాడు ఉద్దండులైన దర్శకులు, రచయితలు, ఫొటోగ్రాఫర్‌ల నిపుణతను కూడా మనకు పరిచయం చేయడం అరుదైన అంశం.

మొదటి టాకీ సినిమా 'కాళిదాసు' అని పరిశోధన ద్వారా వెల్లడించిన మొదటి రచయిత జయదేవ అన్నది కూడా సామాన్య విషయం కాదు. అలాగే మన దేశంలో మొదటి మూకీ సినిమా దాదాఫల్కే 'రాజా హరిశ్చంద్ర'. దక్షిణ భారతదేశంలో టాకీలు రావడానికి హెచ్ఎం రెడ్డి ఎనలేని కృషి చేశారు. మన సినిమా బొంబేలో పుట్టి క్రమంగా మద్రాసుకు చేరింది. టాకీలలో మొదటి సినిమా ఆర్దేషి ఇరానీ 'ఆలం రా' (1931). మొదట వచ్చిన సినిమాలలో పౌరాణికం ఎక్కువగా వచ్చాయి. సమాజంలో చోటు చేసుకున్న అవినీతిని ప్రతిబింబించిన సినిమా వాహినీ వారి "పెద్ద మనుషులు". అలాంటి వాటిలో మకుటాయమానం. ఆనాడు సినిమా రంగంలో పనిచేస్తున్న దర్శకులు, ఫొటోగ్రాఫర్లు, పాటల రచయితలు తదితరుల గురించి, నటీనటుల గురించి ఇందులో తెలియజేశారు. ఆ రోజుల్లో వచ్చిన తెనాలి రామకృష్ణలో రామకృష్ణ పలికిన వ్యంగ్యం, కొంటెతనం బాగా ఆకర్షించాయి. రైతుబిడ్డ సినిమాలో ఇంట్లో పనిచేసేవాడు కుక్కను మంచిగా చూసుకుంటే రూపాయ వేతనం పెంచుతానని, కసురుకున్నప్పుడు రూపాయ కంటే ఎక్కువ కోసేస్తానని చెప్పడం జమీందారు స్వభావాన్ని వెల్లడించడం మనకు తెలియజేస్తుంది.

క్రమంగా పట్టణాలకు ధియేటర్లు, చిన్న పట్టణాలకు టెంట్లు వచ్చి గ్రామీణ ప్రజల వరకు సినిమా అందుబాటులోకి వచ్చింది. 1950 వరకు వచ్చిన సినిమాలది మొదటి దశ అయితే, 1960 ల తర్వాత 1970 వరకు వచ్చినవి రెండో దశ అని చెప్పవచ్చు. ఈ కాలంలో వచ్చిన వాటిని గొప్ప సినిమాలుగా చెప్తారు. అనంతరం 2000 సంవత్సరం దాకా, అప్పటి నుంచి 2025 లోపు వచ్చినవి నాలుగో దశ. 1970 ల తర్వాత వచ్చిన వాటిలో అనేక సినిమాలు సామాజిక మార్పు కోసం, సంగీతభరితమైనవి వచ్చి ప్రేక్షకులను అలరించాయి. అయితే వేషభాషలు (డైలాగ్‌లు, డ్రెస్‌లు) తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటి సినిమాలలో విలువలు, వలువలు ఉండటం లేదని నటి అంజలి వ్యాఖ్యానించారంటే అర్థం చేసుకోవచ్చు.

భారతదేశంలో నిర్మించిన తొలి ఇంగ్లీషు సినిమా 'కర్మ'. ఇప్పటికీ గుర్తున్న నటి దేవికారాణి, నటుడు హిమాన్షురాయ్ మధ్య అధర

గ్రంథ సమీక్ష



ముద్దు చూపించిన వాల్ పోస్టర్‌ను పుస్తకంలో ప్రచురించి ఆనాటి ప్రత్యేకతను తెలిపారు. నేటి సినిమాలలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్ సినిమాలో 'నాటు నాటు' పాటకు ప్రపంచవ్యాప్త గుర్తింపు వచ్చిన అంశాన్ని తెలిపే ఇప్పటి కొన్ని సినిమాలు, దర్శకుడు, నటీనటులకు వచ్చిన కీర్తిని వివరించడం ఇప్పుడు వచ్చే సినిమాలలో కొన్ని మిన్నగా ఉన్నాయని తెలిపారు. మూకీ సినిమాల కాలంలో స్టంట్ మాస్టర్ విఠల్ ఫొటో సాధించి ముద్రించడం, జయదేవ కృషి తెలియజేస్తుంది.

ప్రపంచంలో సినిమాటోగ్రఫీ ప్రదర్శన తొలిసారిగా ఫ్రాన్సు రాజధాని పారిస్‌లో 1885 డిసెంబరు 28 న జరిగితే 1896 లో లూమియర్ సోదరుల ఫొటోగ్రాఫ్ మన దేశానికి వచ్చింది. సినిమాటోగ్రాఫ్ చిన్నదిగా, ఆకర్షణీయంగా, ఎక్కడికైనా తీసుకువెళ్లడానికి తేలికగా ఉండటం దీని ప్రత్యేకత. అలనాటి రైలు ఫొటోను చూడవచ్చు. సినిమా ఫొటోగ్రాఫ్ ప్రదర్శనలు చూసి ముగ్ధుడై తానే చలనచిత్రాలకు రూపకల్పన చేసిన మొదటి భారతీయుడు 'సావేదాదా' గా అందరూ పిలిచే హరిశ్చంద్రసఖారామ్ భట్వాడేకర్. 1907 లో మధ్య కలకత్తాలో కట్టిన 'ఎల్ఫిన్ పిక్చర్ పాలెస్ (2013 కూల్చారు) చాప్లిన్ సినిమాహాలుగా పిలిచారు. కోయంబత్తూరులో డిలైట్ ధియేటరు, తొలి భారతీయ ఫీచర్ ఫిల్మ్ 'రాజా హరిశ్చంద్ర' చిత్రంలో ఫొటోలాంటి మనకు తెలియని అనేక విషయాలను జయదేవ మనకు విశదీకరించారు.

1930 లలోనే మూకీ కాలంలో కెమెరాను సొంతంగా తయారుచేసి సినిమా చిత్రీకరిస్తున్న బాబూరావు పెయింటర్ లాంటి ఫొటోగ్రాఫర్ అరుదైన ఫొటోగ్రాఫర్ ఫొటోను చూడవచ్చు. అనేక అరుదైన వివిధ భాషలలోని సినిమాలు, నటీనటుల ఫొటోలను అలనాటి అనేక ప్రసిద్ధి చెందిన, తెలుసుకోవలసిన అంశాలను జయదేవ మనకు అందించి అవార్డు పొందవలసిన చేయి తిరిగిన రచయితగా నిలిచిపోయారు.

దక్షిణ భారతదేశంలోని ఐదు భాషల్లోని సుప్రసిద్ధ సినిమాలు, దర్శకుడు, మాటలు, పాటల రచయితలు, ప్రసిద్ధ నటీనటుల ఫొటోలను వివరాలు ఇందులో చూడవచ్చు. ఇంత మేలైన పరిశోధన చేసిన నా స్నేహితుడు రెంటాల జయదేవకు హృదయపూర్వక అభినందనలు.

టి.వి.సుబ్బయ్య, సీనియరు జర్నలిస్టు

వస్తా నీ వెనక

నా దారిలో నా మటుకు నేను వెళ్తుంటే
ఎన్నో కళ్ళు ఎక్సరేలు తీసిపారేస్తున్నాయ్
మంచికళ్ళు మెచ్చుకుని ముందుకుతోస్తుంటే
ఓర్వలేని కుళ్ళు కళ్ళు వెనక్కి లాగుతున్నాయ్
నా వెనక ముందుగా మిత్రులు నడిచారు
ఆనక భార్యాపిల్లలు వచ్చి చేరారు
క్రమక్రమంగా బంధువులూ వెనకే వచ్చారు
దారి బాగున్నంతసేపూ సాఫీ ప్రయాణం
ఎత్తుపల్లాలొచ్చినప్పుడే కాస్తంత ప్రమాదం
ఎవరొచ్చినా రాకపోయినా ఫర్వాలేదు
ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏమీకాదు
అనుక్షణం నన్నంటిపెట్టుకునేది నా నీడ
చివరికి నీడ జాడ కూడా లేనప్పుడు
నా వెనక వచ్చేవి సాధించిన కీర్తిప్రతిష్టలే!

శర్మ సీహెచ్.,
9440587567

బాలల సాహితీవేత్త నార్ల



బాలలకోసం ఎంతోమంది బాలసాహిత్యం పేరుతో రచనలను అందించారు. అవి ఎంతగానో వారిని అలరించాయి. వారిలో నార్ల చిరంజీవి ఒకరు. ప్రముఖ రచయిత్రి టి. శాంతాభాస్కర్ నార్ల చిరంజీవిగారి గురించి 'పిల్లల బొమ్మల నార్ల చిరంజీవి' పేరుతో ఆయన గురించి తెలియజేయడమే కాదు, ఆయన సాహిత్యాన్ని పిల్లలకు తెలిపే ప్రయత్నం చేశారు. ఇందులో నార్లవారి బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగవిధులు, నివాసం అలాగే బాల సాహిత్యవేత్తలతో పరిచయం, విశాలాంధ్ర దినపత్రిక– చిన్నారిలోకం, తొలి రచనలు, తెలుగుపూలు, గేయరచనలు వంటివి తెలిపారు. 1954సం॥లో విశాలాంధ్ర దినపత్రికలో 'చిన్నారిలోకం' అనే శీర్షికను నిర్వహించి దీని ద్వారా ఎంతోమంది రచయితల రచనలను ప్రచురించే అవకాశం కల్పించారు. అలాగే అసంఖ్యాకమైన గేయాలు విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమయ్యాయి. బాలల హావభావాలను, అవసరాలను, అర్థంచేసుకుని, మానవీయ విలువలను నేర్పించే గేయాలను ఆయన తన రచనల్లో అందించారు. నార్లవారికి పిల్లలపై వాత్సల్యం ఎక్కువ. అందుకే వారికోసం ప్రత్యేక రచనలు చేసేవారు. అలా అందించిందే 'తెలుగుపూలు'. ఇందులో పద్యాలు సులభరీతిన పిల్లలకు ఎన్నో నీతులను, సంఘరీతులను బోధిస్తాయి.

తెలుగుభాష గురించి చెబుతూ 'మధుర మధురమైన మన భాషకంటెను/ చక్కనైన భాష జగతి లేదు/ తల్లి పాలకంటె తనయులకేపాలు/ బలమునీయగలవు? తెలుగుబిడ్డ' అని భాష గురించి 'వెలుగు రాకముందె వేగనిదుర లెమ్ము/ ప్రొద్దు బొడువ నిదుర బోవరాదు/ సోమరితనమేల శుచిశుభ్రముల యందు/ తెలిసి నడచుకొమ్ము తెలుగుబిడ్డ' అని సోమరిగా ఉండక ఉదయాన్నే నిద్రలేచి నువ్వు నిర్వర్తించవలసిన కార్యక్రమాలను నిర్వర్తించాలని ప్రబోధిస్తారు.

ఇలా ఎన్నో గేయాలు పిల్లలకు స్ఫూర్తినిస్తాయి. అలాగే 'వాగ్దానం, ఆరాధన (1962), గుడిగంటలు, వారసత్వం, కలవారికోడలు వంటి అనేక చిత్రాల్లో మధురమైన పాటలను అందించారు. బాలల సాహిత్యవేత్తగా నార్లవారి గురించి పిల్లలే కాదు పెద్దలు సైతం తెలుసుకోదగ్గ విషయాలు క్లుప్తంగానైనా అందించారు రచయిత్రి.

నార్ల చిరంజీవి బాలసాహిత్యం - టి.శాంతా భాస్కర్
పేజీలు: 52, వెల: రూ.50/-
ప్రతులకు: లోకేష్ ప్రచురణలు, నెం.2-711/2,
షాహుకార్ బంగ్లా వీధి,
కొంగారెడ్డిపల్లి, చిత్తూరు -517001.
సెల్: 9908441523

-కార్తికేయ

నేటి తరానికి మహా ప్రస్థానం @ 75

'నేనొక దుర్గం! నాదొక స్వర్గం!
అనర్గళం, అనితరసాధ్యం నా మార్గం'

'1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నుంచీ దాన్ని నేను నడిపిస్తున్నాను.తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు ఈ శతాబ్దం నాది' అంటూ తన అక్షర ప్రభావ ప్రస్థానపు ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు శ్రీ శ్రీ.ప్రపంచం ఆర్థికమాంద్యంతో తల్లడిల్లి ఆకలితో అలమటిస్తున్న 1930–1940 మధ్యకాలంలో సామాన్యుల వ్యథలను నవీనత్వంతో వ్యక్తపరుస్తూ, సామాజిక వాస్తవికతకు దర్పణం పట్టేలా రాసిన శ్రీ శ్రీ మహాప్రస్థానం గేయాలు 1950 లో పుస్తకరూపంలో ధరించింది. ఆ పుస్తక ప్రభ, అందులోని కవిత్వపు శోభ 75 వసంతాలైన ఇంకా నేటి ఆధునిక ప్రపంచానికి రిలవెంట్ గానే వుంది. నేటికీ శ్రీశ్రీ పేరు మీద ఎన్నో సామాజిక, సాహిత్య స్వచ్ఛంద సంస్థలు నవసమాజ నిర్మాణం కోసం అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తూనే వుండటమే అందుకు తార్కాణం. మహాప్రస్థానం లోని గేయాలు నేటి కృత్రిమ మేధతో కూడిన ఇంగ్లీష్ మీడియం బోధన యుగంలో కూడా నేటి యువతరం నాలుకలపై అద్భుతంగా పలుకుతున్నాయి. కవిత్వం రాస్తున్న ప్రారంభ దశలో ఏ కవినైనా..నువ్వేమన్నా శ్రీ శ్రీ అనుకుంటున్నావా అని ఎవరైనా అంటే ముసి ముసి నవ్వులు చిందిస్తూ పొంగిపోని వారు ఎవరుంటారు చెప్పండి ఇప్పటికీ..!... ఎప్పటికీ..! అలాంటి మహా ప్రవాహం కోసం పదండి ముందుకు మహాప్రస్థానం గేయాలను ఓసారి స్మరించుకుందాం..!

'కళ్ళంటూ ఉంటే చూసి / వాక్కుంటే రాసీ!
ప్రపంచమొక పద్మవ్యూహం! / కవిత్వమొక తీరని దాహం!"

ప్రపంచ వ్యాప్తంగా వచన కవిత్వం ఎలా రాయాలనే దానికి విభిన్న అభిప్రాయాలు వున్నా ...ఇలానే రాయాలనే నిబంధన ఏమీలేదు. గురజాడ అడుగుజాడలతో ఆరంభమైన సామాన్యుని భాషలోనే కవిత్వం శ్రీశ్రీ తో విశ్వవ్యాప్తమైంది. పాండిత్యంతో సంబంధం లేకుండా సామాజిక సమస్యలపై స్పందించే ప్రతి సగటు మనిషికి కవిత్వం రాసే ప్రేరణ లభించింది.

'ఇక్కడ నిలబడి నిన్ను /ఇవాళ ఆవాహనం చేస్తున్నాను!
అందుకో ఈ చాచిన హస్తం! / ఆవేశించు నాలో!
ఇలా చూడు నీకోసం / ఇదే నా మహాప్రస్థానం!' అంటూ శ్రీశ్రీ తన మిత్రుడు కొంపెల్ల జనార్దన్ రావుపై రాసిన 'తలవంచుకు వెళ్లిపోయావా, నేస్తం!' అంకితం గేయంతో మనల్ని అడుగులు వేయిస్తుంది..మహా ప్రస్థానం!

నేటి స్వతంత్ర భారతావనిలో కూడా స్వతంత్రం రాకముందే రాసిన మహాప్రస్థానం గేయాలు సమాజంలో సజీవమై ఇంకా అక్కడక్కడా అప్పుడప్పుడు కనిపిస్తూనే వున్నాయి. కన్నీటి సాక్షిగా కదిలిస్తూనే వున్నాయి. పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వివక్షత, దౌర్జన్యం, అసమానతలు వంటి ప్రాపంచిక సమస్యలు మనకు నాగరిక ప్రజాస్వామ్య లౌకిక సమాజంలో కూడా తారస పడుతూనే వున్నాయి.

'ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ,/ఒక జాతిని వేరొక జాతీ,
పీడించే సాంఘిక ధర్మం / ఇంకానా?ఇకపై సాగదు'
'కూటి కోసం, కూలీ కోసం / పట్టణంలో బ్రతుకుదామని
తల్లిమాటలు చెవిని పెట్టక / బయలుదేరిన బాటసారికి,....
ఎంత కష్టం..!'

'ఆ అవ్వే మరణిస్తే ఆ పాపం ఎవ్వరి'దని వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళిపోయింది!

'అంతేలే,పేదల గుండెలు! / అశ్రువులే నిండిన కుండలు!
శ్మశానమున శశికాంతులలో / చలిబారిన వెలి రాబండలు!'

విశ్వాంతరాళంలో మనస్థాయి ఎంత? అంటూ అంతరిక్ష సరిహద్దులను దాటి ఆలోచిస్తున్న నేటి ఆధునిక మానవుని గురించి...

'ఆలోచనలు పోయేవాడా! / అనునిత్యం అన్వేషించే వాడా! / చెట్టూ, చెరువూ, గట్టూ, పుట్టా / ఆకసంలో, సముద్రంలో/ అన్వేషించేవాడా! అని ఆనాడే మన భవిష్యత్తును రాసారు.

'పొలాల నన్నీ,హలాల దున్నీ, / ఇలా తలంలో హేమం పిండగ –
జగానికంతా సౌఖ్యం నిండగ –
....
నాలో కదలే నవ్య కవిత్వం / కార్మికలోకపు కల్యాణానికి,
శ్రామికలోకపు సౌభాగ్యానికి / సమర్పణంగా,సమర్చనంగా –'

అంటూ సాగిన శ్రీ శ్రీ ప్రతిజ్ఞ నేటి శ్రామిక, కార్మిక, కర్షక లోకానికి నిలువెత్తు నిదర్శనం.



'మాకు గోడలు లేవు / గోడలను పగులగొట్టడమే మా పని.
అలజడి మా జీవితం / ఆందోళన మా ఊపిరి.
తిరుగుబాటు మా వేదాంతం." – అంటూ తన ధిక్కార స్వరాన్ని శాస్త్రీయ సాహిత్యప్రపంచం వైపు విప్లవ కాంతులతో మళ్ళించాడు.

గెలుపోటములను పట్టించుకోకుండా ప్రయత్నాలు ఆపకుండా జీవనగమనం వుండాలని సమాజం ఎప్పుడూ సాపేక్షమే అని

'నిప్పులు చిమ్ముకుంటూ/ నింగికి నేనెగిరిపోతే / నిబిడాశ్చర్యంతో వీరు–
నెత్తురు క్రక్కుకుంటూ / నేలకు నే రాలిపోతే, / నిర్దాక్షిణ్యంగా వీరె..' అంటూ వివరించారు.

'నే నేదో విరచిస్తానని,/ నా రచనలలో లోకం ప్రతిఫలించి/ నా తపస్సు ఫలించి,/ నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ/ నా జాతి జనులు పాడుకునే / మంత్రంగా మోగించాలని,..."

నేటికీ ప్రపంచ భాషలలో ఎక్కడా కూడా 'కవితా!ఓ కవితా!' వంటి అద్భుతమైన కవిత్వం రాలేదని మహాకవులు సైతం శ్రీ శ్రీ ని అభినందించారు. బహుశా నోబెల్ బహుమతి స్థాయి సాహిత్యం ఇది.

'మెరుపు మెరిస్తే, / వాన కురిస్తే, / ఆకసమున హరివిల్లు విరిస్తే / అవి మీకె అని ఆనందించే కూనల్లారా!' అంటూ రాసిన శైశవ గీతి పిల్లలకు ఇవ్వాల్సిన స్వేచ్ఛ ప్రపంచపు విలువను తెలియజేస్తుంది. ఒత్తిడి లేని విద్యను పిల్లలకు సూచిస్తుంది.

ఇక చివరగా ఈ లోకం మీదేనండి!ఈ రాజ్యం మీరేలండి! అంటూ జగన్నాథుని రథచక్రాలు మనల్ని ముందుకు తీసుకెళ్తాయి. ప్రఖ్యాత సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు జాతీయ పురస్కారం అందించిన ఠాగూర్ సినిమాలోని పాట పల్లవిలో కూడా 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!' అంటూ శ్రీ శ్రీ మహాప్రస్థానం మనకు కనిపిస్తుంది. మహాప్రస్థానం లాంటి కొన్ని పుస్తకాలు కొన్ని శతాబ్దాల పాటు కాలాన్ని నడిపిస్తూ భవిష్యత్తు తరాలకు మార్గదర్శనం చేస్తుంటాయి. మానవత్వపు రహదారిపై మనల్ని నడిపిస్తుంటాయి. ఏదేమైనా ఈ శతాబ్దపు సాహితీ ప్రయాణంలో శ్రీ శ్రీ మహాప్రస్థానం ఓ ధృవతార అనడంలో అతిశయోక్తి ఏమీలేదు.

'శ్రీ శ్రీ పుస్తకం కొని తీరికగా చదవండి, పద్యం పదిసార్లు చదవండి. ఏమి అర్థం కాలేదా–ఏ యువకుడికో, భిక్షుకుడిగో death-bed present గా పంపండి. పారెయ్యకండి. అంతకన్నా దాచుకోకండి. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వశక్తి మీ చేతుల్లో పుస్తకం. pass it on' అంటూ చలం దాదాపు 85 సంవత్సరాల కిందటే చెప్పారు..!

ఫిజిక్స్ అరుణ్ కుమార్, 9394749536

అసలు సమస్యలు వెనక్కు...ఉచితాలు తెరపైకి!

- అధికారమే పరమావధి
- ఢిల్లీలో ప్రధాన పార్టీల తీరు
- కాలుష్య కోరల్లో దేశ రాజధాని
- నీటికోసం ప్రజల ఇబ్బందులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలు సమీపించిన క్రమంలో రాజకీయ వేడెక్కింది. రాజకీయ పార్టీలు ఉచిత హామీలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఢిల్లీ ప్రజల్ని తమ వైపు తిప్పుకునేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో అసలు ప్రజా సమస్యలు తెరమరుగవుతున్నాయన్న విమర్శలొస్తున్నాయి. ఢిల్లీలోని ప్రమాదకర కాలుష్యం, శాంతిభద్రతల అంశం, మహిళలపై నేరాలు, మహా నగరంలోని మౌలిక వసతుల లేమి వంటి కీలక అంశాలు ఎన్నికల ప్రచారంలో చర్చకు రావడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉచిత హామీలను నమ్ముకొని ఎన్నికలకు వెళుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని అన్ని సీట్లను బీజేపీ గెలుచుకుంది. ఈ క్రమంలో బలంగా ఉన్న బీజేపీని ఢీకొనాలంటే ఉచిత హామీలు మించిన మరో మార్గం లేదని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భావించారు. వివిధ కీలక ఉచితహామీలను కేజ్రీవాల్ ప్రకటించారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లోని ప్రజలను ఆకట్టుకునేలా ఒక పథకం ప్రకటించారు. సెక్యూరిటీ గార్డులను నియమించుకునేందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లకు ఆర్థిక సాయం అందిస్తామని ఆప్ అధినేత తెలిపారు. ఉచితంగా విద్యుత్, విద్య, నీటి వసతి, వైద్య సేవలు, మహిళలకు ప్రజారవాణా వంటి అంశాలను ప్రజలకు వివరించేందుకు 'రేవ్డీ పర్ చర్చా' ప్రచార కార్యక్రమాన్ని ఆప్ నిర్వహిస్తోంది. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళకు ప్రతినెలా రూ.2,100 అందించే ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజనను కేజ్రీవాల్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వృద్ధులకు ఉచిత వైద్యాన్ని అందించే సంజీవని యోజనను ఆయన ప్రకటించారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేక మంది కౌలుదారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ విషయానికొస్తే... తాము అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత రేషన్ కిట్లు, ఏడాదిపాటు నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.8,500, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు కల్పిస్తామని పేర్కొంది. ప్రత్యేకించి తాము అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతినెలా రూ.2,500 చొప్పున అందిస్తామని అంటోంది. ఇందుకోసం 'ప్యారీ దీదీ యోజన'ను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇస్తోంది. దీంతో పాటు జీవన్ రక్షా యోజన ద్వారా రూ.25 లక్షల దాకా బీమా కవరేజీని కల్పిస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉచిత హామీలపై విమర్శలు గుప్పించారు. వాటిని 'ఫ్రీ కీ రేవ్డీ'లుగా అభివర్ణించారు. అయితే తాము ఎన్నికల్లో గెలిస్తే వాటన్నింటిని కొనసాగిస్తామని స్పష్టం చేయడం గమనార్హం. ఈ సంక్షేమ పథకాల ముసుగులో కుంభకోణాలకు పాల్పడిన వాళ్ల భరతం పడతామన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో హోరాహోరీ పోటీ వల్లే ఉచిత సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని మోదీ చెప్పారు. బీజేపీ సైతం 'సంకల్ప పత్రా' పార్ట్-1 పేరుతో విడుదల చేసిన పార్టీ హామీలను ప్రకటించింది. అందులో గర్భిణులకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై రూ.500కే ఎల్పీజీ సిలిండర్లు, 'మహిళా సమృద్ధి యోజన' కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం వంటి హామీలను ప్రకటించింది. ప్రధాన రాజకీయపార్టీల తీరు ఈ విధంగా ఉండగా... దేశ రాజధాని ఢిల్లీ వాసుల్ని అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. కాలుష్య సమస్య కొరకరాని కొయ్యగా మిగిలింది. దీనివల్ల ప్రజల ఆరోగ్యాలకు ముప్పు పొంచి ఉంది. 2024, నవంబరులో ఢిల్లీలో గాలి నాణ్యతా సూచి(ఏక్యూఐ) 490 పాయింట్లకు పడిపోయింది. దీనికి పరిష్కారాన్ని సూచించే మార్గాన్ని ఏ ఒక్క పార్టీ కూడా చూపించడం లేదు. ఢిల్లీకి ప్రధాన జలవనరుగా ఉన్న యమునా నదిలో అమోనియా అధిక మోతాదులో ఉంది. ఆ నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల సామర్థ్యం అంతంత మాత్రమే. ఫలితంగా ఢిల్లీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సరిపడా నీటి పంపిణీ జరగని స్థితి నెలకొంది. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు ఢిల్లీ జలమయం అయింది. ఎన్నో ప్రాంతాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. అనేక చోట్ల ఓపెన్ నాలాలు, డ్రైనేజీల్లో పడి ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. రాజేందర్ నగర్‌లోని సివిల్స్ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లోకి వరద నీరు చేరి ముగ్గురు అభ్యర్థులు మునిగిపోయారు. అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థని బాగు చేయించడంపై రాజకీయ పార్టీలు ఊసెత్తడం లేదు. ఢిల్లీ పరిధిలో మహిళలపై దాడులు, లైంగిక వేధింపుల ఘటనలు పెరిగాయి. శాంతిభద్రతలను నియంత్రణలో ఉంచే ప్రణాళికలను రాజకీయ పార్టీలు ప్రకటించడం లేదు. ఢిల్లీలో భారీగా నిరుద్యోగులు ఉన్నారు. వారికి ఉపాధిని కల్పించే పథకాలపైనా పార్టీలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. వివిధ ప్రభుత్వ విభాగాల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పట్టించుకునే వారే లేరు.

వారికి భూములిచ్చి ఆదుకోండి

మోదీకి కేజ్రీవాల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులందరికీ నివాసాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ఆప్ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్ తెరపైకి తెచ్చారు. ఇందుకోసం ఒక పథకాన్ని రూపొందించి దాని ద్వారా వారికి ఈఎంఐల రూపంలో నగదు చెల్లించే అవకాశం ఇవ్వాలన్నారు. కేజ్రీవాల్ ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, 'ఢిల్లీ ప్రభుత్వానికి భూములు ఇవ్వండి. ప్రభుత్వోద్యోగులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఈ భూమిని పంపిణీ చేద్దాం. రాజ్యాంగం ప్రకారం దేశ జాతీయ రాజధాని అయిన ఢిల్లీలో భూ పంపిణీ చేసే అధికారం అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఈ అంశం కేంద్రం చేతుల్లో ఉంది. అందుకే ప్రధాని మోదీకి ఈ మేరకు లేఖ రాశాను' అని తెలిపారు. ఢిల్లీలోని పారిశుద్ధ్య కార్మికులు గురించి కూడా లేఖలో మోదీకి వివరించినట్లు కేజ్రీవాల్ తెలిపారు. 'ఎన్డీఎంసీ, ఎంసీడీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నివాసం ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. వారికి రాయితీలు కల్పించి తక్కువ రేట్లకు భూమిని ఇస్తే వారు గృహాలను ఏర్పాటు చేసుకుంటారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వీరిది కీలక పాత్ర. వారు నగరానికి వెన్నెముక లాంటివారు. భూమి కోసం తీసుకున్న రుణాన్ని నెలవారీ పద్ధతుల్లో తిరిగి చెల్లించే విధంగా పథకం తీసుకురండి. వారు ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన వాటిల్లో నివాసం ఉంటున్నారు.

అవి తాత్కాలికమే. పదవీ విరమణ తర్వాత వారు ఆ గృహాలను వదిలేయాల్సిన పరిస్థితి ఉంది. శానిటేషన్ కార్మికులు వేరే ఇళ్లు కొనుక్కోవాలన్నా, ఢిల్లీ వంటి మహా నగరంలో అద్దెకు ఉండాలన్నాఅది భరించలేనంతగా ఉంది. అలా కాకుండా వారికి భూమిని ప్రభుత్వమే ఇచ్చి ప్రోత్సహం ఇస్తే వారికి ఎంతో మేలు చేసిన వారిగా మిగిలిపోతాం' అని లేఖలో పేర్కొన్నట్లు కేజ్రీవాల్ తెలిపారు.

ఢిల్లీ పోలీసులు మళ్లీ అడ్డుకున్నారు

డాక్యుమెంటరీ ప్రదర్శనపై ఆప్

న్యూఢిల్లీ : అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా పార్టీ నాయకుల అరెస్టు ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించే తమ మరో ప్రయత్నాన్ని ఢిల్లీ పోలీసులు మరోసారి అడ్డుకున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆదివారం ఆరోపించింది. దీనిపై పోలీసులు వెంటనే స్పందించలేదు. అయితే 'అన్‌బ్రేకబుల్' అనే డాక్యుమెంటరీని ప్రదర్శించడానికి పార్టీ అనుమతి కోరలేదని, నగరంలో ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలు కారణంగా దానిని అనుమతించలేమని వారు శనివారం చెప్పారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ డాక్యుమెంటరినీ ప్రదర్శించాల్సిన తన విలేకరుల సమావేశానికి పోలీసులు అనుమతి నిరాకరించారని చెప్పారు. 'ఏ నియమం ప్రకారం అనుమతి నిరాకరించారో నేను ఎన్నికల సంఘాన్ని అడగాలనుకుంటున్నాను. ఎటువంటి బహిరంగ సభ, ఎన్నికల ప్రచారం లేదా ఓటు కోసం విజ్ఞప్తి చేయబోవడం లేదు. నేను విలేకరుల సమావేశానికి, డాక్యుమెంటరీని ప్రదర్శించడానికి ఒంటరిగా వచ్చాను' అని సంజయ్ సింగ్ సెంట్రల్ ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియం వెలుపల అన్నారు. విలేకరుల సమావేశం, ప్రదర్శనకు అనుమతి నిరాకరించడం జరిగిందని తనకు మౌఖికంగా తెలియజేశారని ఆయన తెలిపారు. అవినీతి కేసుల్లో గత రెండు సంవత్సరాలుగా ఆప్ నాయకుల అరెస్టు ఆధారంగా ఐటీఓ సమీపంలోని ప్యారేలాల్ భవన్‌లో జరిగిన ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ఎటువంటి అనుమతి తీసుకోలేదనే కారణంతో పోలీసులు అడ్డుకున్నారు. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఎంసీసీ అమలులో ఉన్నందున ఈ కార్యక్రమానికి అనుమతి తీసుకోవడం తప్పనిసరి. తన పార్టీ నాయకుల అరెస్టు వెనుక ఉన్న 'రహస్యాలు', 'కుట్రలను' బహిర్గతం చేయడం వల్ల బీజేపీ ఈ డాక్యుమెంటరీని చూసి భయపడుతోందని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఆరోపించారు. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, సత్యేంద్ర జైన్ వంటి ప్రముఖ ఆప్ నాయకులను 2023 నుంచి 2024 మధ్య కాలంలో అవినీతి కేసుల్లో కేంద్ర సంస్థలు అరెస్టు చేశాయి.

కేజ్రీవాల్ దళిత వ్యతిరేకి

కాంగ్రెస్ నాయకుడు ఉదిత్ రాజ్

న్యూఢిల్లీ : ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ 'దళిత వ్యతిరేకి' అని కాంగ్రెస్ నాయకుడు ఉదిత్ రాజ్ ఆదివారం అభివర్ణించారు. ఆలయ పూజారులు, గురుద్వారా గ్రాంటీలకు నెలవారీ గౌరవ వేతనం అందించే పథకాన్ని ఆయన పార్టీ ప్రకటించినప్పటికీ, వాల్మీకి, రవిదాస్ దేవాలయాల పూజారులను తొలగించారని అన్నారు. వాల్మీకి, రవిదాస్ దేవాలయాల 'భిక్షువులు', పూజారులు పార్టీ ప్రతిపాదిత పథకం కింద తమను చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా సోమవారం జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతారని మాజీ ఎంపీ చెప్పారు. డిసెంబరు 30న రాబోయే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి వస్తే ఆప్ 'పూజారి గ్రంథి సమ్మాన్ యోజన' కింద ఆలయ పూజారులు, గురుద్వారా గ్రాంటీలకు నెలకు రూ.18 వేలు ఇస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. ఉదిత్ రాజ్ మాట్లాడుతూ 'కేజ్రీవాల్ దళిత వ్యతిరేకి. ఇటీవల ఆయన ఆలయ పూజారులు, గురుద్వారా గ్రాంటీలకు నెలకు రూ.18 వేలు ఇచ్చే పథకాన్ని ప్రకటించారు. కానీ అది వాల్మీకి, రవిదాస్ ఆలయాల పూజారులకు వర్తించదు' అని తెలిపారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు ఒక దళితుడిని ఉప ముఖ్యమంత్రిగా చేస్తామని ఆప్ హామీ ఇచ్చిందని, అయితే అది తన హామీని నిలబెట్టుకోలేదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. పార్టీ 11 మంది రాజ్యసభ ఎంపీలలో ఒక్కరు కూడా ఎస్సీ లేదా ఓబీసీ వర్గానికి చెందినవారు కాదని చెప్పారు. 70 మంది సభ్యుల ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనుండగా, ఫలితాలు ఫిబ్రవరి 8న ప్రకటిస్తారు

మహిళల వస్త్రధారణపై నితీశ్ అనుచిత వ్యాఖ్యలు

పాట్నా: మహిళల వస్త్రధారణపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాను అధికారం చేపట్టిన 20ఏళ్ల తర్వాత రాష్ట్రంలోని మహిళల వస్త్రధారణ మెరుగుపడిందంటూ నితీశ్ చేసిన వ్యాఖ్యలకు అన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నితీశ్ సర్కార్ ప్రస్తుతం రాష్ట్రమంతటా 'ప్రగతి యాత్ర' ను నిర్వహిస్తోంది. బెగుసరాయ్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో నితీశ్ కుమార్ మహిళల వస్త్రధారణపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ ఘాటుగా స్పందించారు. సీఎం నితీశ్ కుమార్ ఫ్యాషన్ డిజైనర్ కాదని, ఆ మాటలు ఆయన వికృత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి అని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక వీడియో కూడా పోస్ట్ చేశారు. ఆ వీడియోలో.. 'అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. బాగా మాట్లాడతారు. చక్కని దుస్తులు ధరిస్తారు. వారు ఇంతకు ముందు ఇంత మంచి బట్టలు ధరించడం మనం చూశామా? అని ప్రశ్నిస్తూనే.. 'ఇంతకు ముందు బీహార్ కుమార్తెలు మంచి దుస్తులు ధరించలేదని కాదు. వారు తమను తాము ఆత్మగౌరవం, స్వావలంబనతో కప్పుకున్నారు' అంటూ సీఎం నితీశ్ వ్యాఖ్యల్ని ఖండించారు. సీఎంగారు.. మీరు మహిళల కోసం ఫ్యాషన్ డిజైనర్‌గా మారడానికి ప్రయత్నించవద్దు. మీ ఆలోచనలు వికృతంగా ఉన్నాయి. మీ ప్రకటన రాష్ట్ర మహిళల్ని అవమానించేలా ఉన్నాయని' ధ్వజమెత్తారు.

ఈసీ పనితీరు భేష్

కుంభమేళా వేడుక భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక

'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరు బ్రహ్మాండంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కితాబిచ్చారు. ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్టం చేస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తోందని చెప్పుకొచ్చారు. ఈనెల 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం జరగనుండటం, ఈసీ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ప్రతిపక్షాల నుంచి తరచూ విమర్శలొస్తున్న క్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ నెలలో చివరి ఆదివారమైన జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉండడం వల్ల 19వ తేదీ (మూడో ఆదివారం) మన్‌కీ బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారం చేశారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... "1951-52లో దేశంలో మొదటి ఎన్నికలు జరిగినప్పుడు, కొంతమందికి దేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందా అని సందేహం ఉంది. కానీ మన ప్రజాస్వామ్యం అన్ని భయాలను తప్పు అని నిరూపించింది. అన్నింటికంటే భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి" అని ఆయన అన్నారు. గత దశాబ్దాలలో కూడా దేశ ప్రజాస్వామ్యం బలపడి, అభివృద్ధి చెందిందని స్పష్టం చేశారు. "మన ఓటింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, బలోపేతం చేసిన ఈసీకి కూడా నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రజల శక్తికి మరింత బలాన్ని అందించడానికి ఈసీ సాంకేతిక శక్తిని ఉపయోగించుకుందన్నారు. నిష్పాక్షిక ఎన్నికలకు ఈసీ నిబద్ధతకు నేను అభినందిస్తున్నా" అని ఆయన అన్నారు. ఈసారి 'గణతంత్ర దినోత్సవం' చాలా ప్రత్యేకమైనదని అన్నారు. ఇది భారత గణతంత్ర 75వ వార్షికోత్సవం. ఈ సంవత్సరం రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయింది. మన పవిత్ర రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ సభలోని అన్ని గొప్ప వ్యక్తులకు నేను నమస్కరిస్తున్నానని ప్రధాని తెలిపారు. మహా కుంభమేళా వేడుక భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని మోదీ చెప్పారు. కుంభమేళా సంప్రదాయం భారతదేశాన్ని కలిపి ఉంచుతుంది. మహా కుంభ మేళాలో యువత భాగస్వామ్యం పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గంగాసాగర్ మేళా గురించి కూడా ప్రస్తావించారు. గంగాసాగర్ ఉత్సవం సామరస్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందని ఆయన అన్నారు. అయోధ్యలోని రామాలయంలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ తొలి వార్షికోత్సవం గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. ప్రాణ్ ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామని అన్నారు. మనం వారసత్వాన్ని కాపాడుకోవాలని, స్ఫూర్తి పొందాలని సూచించారు. యువత అంకుర సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని ప్రధాని పేర్కొన్నారు. దీంతో స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని.. సమాజంలో పరిస్థితులు మారిపోతున్నాయని అన్నారు. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని.. దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పుకొచ్చారు.

సైఫ్‌పై దాడి కేసులో నిందితుడి అరెస్టు

బంగ్లాదేశీయుడిగా నిర్ధారణ... పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి



ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడిని శనివారం అర్ధరాత్రి థానేలో పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ దీక్షిత్ ... ఆదివారం ఉదయం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'ఈ నెల 16వ తేదీ రాత్రి సైఫ్‌పై దాడి జరిగింది. ఎఫ్‌ఐఆర్ నమోదు చేశాం. 30 ఏళ్ల మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించాం. అతడిని అరెస్ట్ చేశాం. దొంగతనం చేయాలనే ఉద్దేశంతో అతడు సైఫ్ నివాసంలోకి వెళ్లాడు. ప్రాథమిక విచారణలో అతడిని బంగ్లాదేశీయుడిగా గుర్తించాం. నిందితుడు అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడు. భారత్ వచ్చాక విజయ్ దాస్‌గా పేరు మార్చుకున్నాడు. ఆరు నెలల క్రితం ముంబై వచ్చాడు. భారతీయుడని చెప్పడానికి అతడి వద్ద సరైన ఆధారాలు లేవు' అని తెలిపారు. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా... దుండగుడు సైఫ్ చిన్న కుమారుడు జేహ్ గదిలోకి వెళ్లాడు. దుండగుడిని చూసిన జేహ్ కేర్‌టేకర్ కేకలు వేయగా సైఫ్ అక్కడికి చేరుకొన్న సమయంలో పెనుగులాట జరిగింది. ఆరుచోట్ల కత్తి గాయాలయ్యాయి. పోలీసులు 20 బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టగా మూడు రోజుల తర్వాత థానేలో అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను బాంద్రాలోని న్యాయస్థానం ఎదుట పోలీసులు హాజరుపరిచారు. వాదోపవాదాలు విన్న న్యాయస్థానం ఐదు రోజులపాటు పోలీసుల కస్టడీకి అనుమతించింది. అతడిని బాంద్రా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఏఐ ఫొటో షేర్... శత్రుఘ్నసిన్హాపై నెటిజన్ల విమర్శల దాడి

సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడిపై ... సీనియర్ నటుడు, ఎంపీ శత్రుఘ్న సిన్హా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టి విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆయన షేర్ చేసిన ఫొటోనే ఇందుకు కారణం. 'నాకెంతో ఇష్టమైన వ్యక్తి, అప్పుడు సైఫ్‌పై దాడి జరగడం దురదృష్టకరం. ఆయన కోలుకుంటున్నందుకు భగవంతుడికి కృతజ్ఞతలు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన ప్రభుత్వం, పోలీసులకు ధన్యవాదాలు. పరిస్థితులు త్వరితగతిన చక్కబడతాయి' అని పేర్కొన్నారు. సైఫ్, ఆయన సతీమణి కరీనాకు సంబంధించి ఏఐ జనరేటెడ్ ఫొటోను షేర్ చేశారు. ఇందులో సైఫ్ బెడ్‌పై ఉండగా కరీనా ఆయన పక్కనే కూర్చుని ఉన్నారు. వీరిద్దరూ నవ్వుతూ ఫొటోకు పోజులిస్తున్నట్లు కనిపించారు. దీనిని చూసిన పలువురు నెటిజన్లు శత్రుఘ్న సిన్హాపై విమర్శలు కురిపిస్తున్నారు. ఏఐ ఫొటో షేర్ చేయాల్సిన అవసరం ఏముంది? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఇలాంటి ఫొటోలు సరైన పద్ధతి కాదని హితవు పలుకుతున్నారు.

నా కొడుక్కి మరణశిక్ష విధించండి

కోర్టు తీర్పుపై స్పందించిన నిందితుడు సంజయ్‌రాయ్ తల్లి

కోల్‌కతా: 'తన కొడుకు తప్పు చేస్తే కచ్చితంగా తగిన శిక్ష విధించాలి. తన కుమారుడు చేసిన తప్పును ఓ మహిళగా ఎప్పటికీ క్షమించను. తనకు ముగ్గురు కుమార్తెలు. వైద్యురాలు పడిన బాధను... నరకాన్ని అర్థం చేసుకోగలను. కొడుకు చనిపోతే ఏడుస్తానేమో కానీ ఓ అమ్మాయి పట్ల ప్రవర్తించిన తీరుకు అతడికి జీవించే హక్కు లేదు. మరణ శిక్ష విధించండి. వైద్యురాలు నాకు కూతురితో సమానం. కుమార్తెకు ఇటువంటి పరిస్థితి వస్తే ఏ తల్లీ ఊరుకోదు' అని నిందితుడి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్జీకర్ ఆసుపత్రి వైద్యురాలి(31)పై హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను కోల్‌కతా కోర్టు దోషిగా తేల్చడంతో అతడి తల్లి పైవిధంగా స్పందించారు. ఈ కేసుపై సుప్రీం కోర్టుకు వెళ్తారా అని మీడియా అడిగిన ప్రశ్నకు సంజయ్ సోదరి మాట్లాడుతూ... ఆ ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. అతడు ఇలాంటి దారుణానికి ఒడిగడతాడని తామెప్పుడూ అనుకోలేదన్నారు. అయితే నేరం జరిగిన ప్రాంతంలో సంజయ్‌తో పాటు మరికొంతమంది ఉన్నట్లు కథనాలు వస్తున్నాయని... ఈ విషయంపై పోలీసులు, సీబీఐ క్షుణ్ణంగా దర్యాప్తు చేసి తగిన శిక్ష విధించాలని కోరారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుడికి ఏ శిక్ష విధించబోయేదీ సోమవారం ప్రకటించనున్నట్లు కోల్‌కతాలోని సియాల్దా అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ ఇప్పటికే ప్రకటించారు. వైద్యురాలిపై ఘటన జరిగిన 162 రోజుల తర్వాత ఈ కేసులో తీర్పు వచ్చింది.

గంగా నదిలో పడవ మునిగి ముగ్గురి మృతి

పాట్నా: గంగా నదిలో పడవ బోల్తా పడి ముగ్గురు మృతిచెందగా మరో నలుగురు గల్లంతైన ఘటన బీహార్‌లోని కతిహార్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పరిమితికి మించి ఓ పడవలో 17 మంది ప్రయాణిస్తున్నారు. అమ్దాబాద్ ప్రాంతంలోని గోలాఘాట్ సమీపంలో గంగా నదిలో బోల్తా పడి మునిగింది. అప్రమత్తమైన కొందరు ఈదుకుంటూ నది ఒడ్డుకు చేరుకున్నారు. పడవ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. నదిలో పడిన పది మందిని రక్షించారు. ఈ సంఘటనలో ముగ్గురు మరణించినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఇద్దరిని పవన్ కుమార్ (60), సుధీర్ మండల్ (70)గా గుర్తించినట్లు చెప్పారు. మరణించిన మరో వ్యక్తిని ఇంకా గుర్తించలేదన్నారు. మరోవైపు పడవ బోల్తాపడిన ఘటనలో నలుగురు వ్యక్తులు గంగా నదిలో గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. రక్షక బృందాలు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పడవలో ఎక్కువ మంది ప్రయాణించడం వల్లనే బోల్తా పడి మునిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పడవ ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ మనేశ్ కుమార్ మీనా వెల్లడించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గల్లంతైన వారి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

నాడు గాజులమ్మకం... నేడు ఐఏఎస్ అధికారి

ముంబై: బాల్యంలో కటిక దారిద్ర్యం అనుభవిస్తూనే, చదువులు కొనసాగించిన కొందరు ఉన్నత స్థానానికి చేరుకున్న ఉదంతాల గురించి మనం అప్పుడప్పుడు వింటుంటాం. ఇదే కోవలోకి వస్తారు రమేశ్ ఘోలాప్. ఈయన సాధించిన విజయం యువతకు స్ఫూర్తినిస్తుందనడంలో ఏమీ సందేహం లేదు. రమేశ్ ఘోలాప్... ఐఏఎస్ అధికారిగా మారేవరకూ సాగించిన ప్రయాణంలో చదువుపై ఆయన చూపిన అంకితభావం, శ్రద్ధ, కృషి మనకు కనిపిస్తాయి. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలోని మహాగావ్ అనే చిన్న గ్రామంలో జన్మించిన రమేశ్ చిన్నప్పటి నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. రమేశ్ తండ్రి గోరఖ్ ఘోలాప్ ఒక చిన్న సైకిల్ మరమ్మతుల దుకాణం నడిపేవాడు. మద్యం అలవాటు కారణంగా అతని తండ్రి ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. ఇంట్లో పరిస్థితి అంతకంతకూ దిగజారింది. ఒక రోజు రమేశ్ తండ్రి దుకాణం మూసివేశాడు. దీంతో తల్లి విమల్ ఘోలాప్ కుటుంబాన్ని పోషించేందుకు సమీప గ్రామాల్లో గాజులు అమ్మడం ప్రారంభించారు. ఆ సమయంలో రమేశ్ తన తల్లికి సహాయం చేస్తూ వచ్చాడు. 2005లో రమేశ్ తండ్రి మరణించాడు. కుటుంబసభ్యులు పొరుగింటివారి సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన రమేశ్‌ను అమితంగా ఆలోచింపజేసింది. పేదరికం నుంచి బయటపడటానికి ఏకైక మార్గం విద్య అని గ్రహించాడు. చదువుపై దృష్టి సారించిన ఆయన ఓపెన్ యూనివర్సిటీ నుంచి ఆర్ట్స్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. 2009లో ఉపాధ్యాయుడైన తర్వాత కూడా, తన ఆశయంపై దృష్టి సారిస్తూ ముందుకు సాగాడు.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష (సీఎస్ఈ)కి సిద్ధం కావాలని నిర్ణయించుకుని పూణేకు పయనమయ్యాడు. ఆ సమయంలో తల్లి అండగా నిలిచింది. 2010లో రమేశ్ తన మొదటి ప్రయత్నంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష విఫలమయ్యాడు. పోలియో బాధితుడైన రమేశ్ 2012లో వికలాంగుల కోటా కింద యూపీఎస్సీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ (ఏఐఆర్)287తో ఉత్తీర్ణుడయ్యాడు. ఐఏఎస్ అధికారి కావాలన్న తన కలను నెరవేర్చుకున్నాడు. ప్రస్తుతం ఐఏఎస్ రమేశ్ ఘోలాప్ జార్ఖండ్ ఇంధన శాఖలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రీమియం రైళ్లలో ప్రయాణించొచ్చు

రైల్వే మంత్రిత్వశాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ: రైల్వే మంత్రిత్వ శాఖ లీవ్ ట్రావెల్ కన్సెషన్ (ఎల్‌టీసీ)ను విస్తరిస్తూ నిర్ణయం తీసుకుంది. దాంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 385 ప్రీమియం ట్రైన్లలో ప్రయాణించేందుకు అనుమతి లభించినట్టయింది. ఇందులో వందే భారత్, హమ్‌సఫర్, తేజస్, రాజధాని, శతాబ్ది, దురంతో రైళ్లు ఉన్నాయి. ప్రస్తుతం 136 వందే భారత్ రైళ్లు, 97 హమ్‌సఫర్, ఎనిమిది తేజస్ రైళ్లు, రాజధాని, శతాబ్ది, దురంతో వంటి 144 రైళ్లలో ప్రయాణం చేయవచ్చని చెప్పింది. వీటిల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికే విలాసవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు. తాజా నిర్ణయంతో దేశంలోని అన్ని జోన్లలోని 385 రైళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు ఎల్‌టీసీ కింద ప్రయాణానికి టికెట్లను బుక్ చేసుకునేందుకు వీలుంటుంది. ఉద్యోగులు తమ స్వస్థలాలు, దేశంలోని ఏదైనా గమ్యస్థానానికి ప్రయాణం చేయొచ్చు. వందే భారత్, తేజస్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తక్కువ, మధ్యస్థ దూరంగా ఉండే ప్రయాణాలకు లెవల్ 11 వరకు ఉన్న ఉద్యోగులు చైర్‌కార్ ప్రయాణాలు చేయవచ్చు. లెవల్ 12 అంతకంటే ఎక్కువ స్థాయి ఉద్యోగులు ఈ రైళ్లలో ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ప్రయాణానికి అర్హులు. లెవల్ 12, అంతకంటే ఎక్కువ స్థాయి ఉద్యోగులు సుదూర ప్రయాణాలకు ఏసీ సెకండ్ క్లాస్‌లో ప్రయాణం చేయవచ్చు. లెవల్ 6 నుంచి 11 వరకు ఉన్న ఉద్యోగులు ఏసీ సెకండ్ క్లాస్‌లో... ఇక లెవల్ 5... అంతకంటే తక్కువ స్థాయి ఉద్యోగులు ఏసీ థర్డ్ క్లాస్‌లో ప్రయాణాలు చేయొచ్చని వివరించింది. నాలుగు సంవత్సరాల వ్యవధిలో దేశంలో ఎక్కడికైనా ప్రయాణించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఆస్ట్రేలియాలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆస్ట్రేలియాలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెల్బోర్న్ తెలుగు అసోసియేషన్ సంబరాలలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లలు దాటి ఆస్ట్రేలియాకు వచ్చినా కూడా మన తెలుగు సాంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ అందరూ కలిసి సంబరాలు నిర్వహించుకోవడం చాలా అభినందనీయమన్నారు. తెలుగు ప్రజలు ఇక్కడ లక్ష మంది ఉండి ఎంతో కష్టపడి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తూ మన సంప్రదాయాలను కాపాడుతూ ఇలా సంబరాలు చేస్కోవడం గొప్ప విషయమని చెప్పారు. మన తెలుగు పల్లెల్లో చేసుకున్న విదంగానే ఇక్కడ పండుగ చేసుకుంటూ ఆనందంగా పండుగ జరుపుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో మన ప్రభుత్వం ఉంది ఇక్కడ ఉన్న తెలుగు పారిశ్రామిక వేత్తలు మీ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టి అక్కడ అభివృద్ధికి సహకారాన్ని అందించాలని సూచించారు. మీఅందరిని చూస్తుంటే చాలా గర్వంగా ఉందని, ఈ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆకాంక్షించారు. సంస్కృతి సంప్రదాయాలు పరిమళించే అతి పెద్ద పండుగ సంక్రాంతి అని సంక్రాంతి ప్రకృతితో అనుసంధామైన రైతుల పండుగ అంటూ చెపుకొచ్చారు. ఆరుగాలం శ్రమించి చేతికొచ్చిన పంటను చూసి రైతు మురిసిపోయే పండుగ అన్నారు. ఈ సంక్రాంతితో రైతుల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరారు.

హనుమకొండలో లలిత జ్యువెలరీ ప్రారంభం

విశాలాంధ్ర - హన్మకొండ : 40 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న లలిత జ్యువెలరీ హనుమకొండ లోని రాయపుర మెయిన్ రోడ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్య, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల వారికి తక్కువ తరుగు తక్కువ ధరలలో నగలు ఇవ్వాలనే ఉద్దేశంతో వినియోగదారుల ఆశీస్సులతో ఈ షోరూమ్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మార్కెట్‌లోని ఇతర షోరూములలో లభించని సరికొత్త బంగారు నగల కొనుగోలు పథకంను అందిస్తున్నామని, ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు నగలపై తరుగులో రెండు శాతం తగ్గింపు, వజ్రభరణాలపై క్యారెట్ కు 6000 రూపాయలు తగ్గింపు, సరికొత్త ఫ్రీ అండ్ ఫ్లెక్సీ 11 నెలల నగల కొనుగోలు పథకంలో చేరి లబ్ది పొందవచ్చని పేర్కొన్నారు. లలిత జ్యువెలరీలో తమకు నచ్చిన నగదు ఫోటోను తీసుకొని అందుకు ఎస్టిమేట్ స్లిప్పును తీసుకోని నాలుగైదు షో రూమ్‌లో ధరలను పోల్చి చూడవచ్చని పేర్కొన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం లలిత జ్యువెలరీ ప్రవేశపెట్టిన మరో పథకం ఫ్రీ బుకింగ్ స్కీంలో భాగంగా ఒక్కసారి నగదు చెల్లించి 11 నెలల తర్వాత ఒక శాతం కూడా తరుగు లేకుండా నగలను కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. హనుమకొండ ప్రాంత వాసులందరూ లలిత జ్యువలరీకి విచ్చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పసుల రామ్మూర్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగపై భౌతికంగా, వ్యక్తిగతంగా రాజ్యాంగానికి విరుద్ధంగా మాట్లాడిన మాల మహానాడు నాయకుడు పసుల రామ్మూర్తి పై చర్యలు తీసుకోవాలని ఆదివారం మల్కాజిగిరి ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పైన భౌతిక దాడులు చేసి కొట్టి చంపమని ప్రజలను రెచ్చగొడుతూ సంఘ విద్రోహ శక్తులలాగా మాల మహానాడు నాయకుడు మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని, ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన వారిని ఈ దేశం నుండి బహిష్కరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులను, మేధావులను, ప్రజాస్వామ్యవాదులను తప్పుబడుతూ మాట్లాడడంపై చట్టపరమైన కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని పోలీసు అధికారులను కోరారు. ఇలాంటి వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోకపోతే జరగబోయే పరిణామాలకు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వీరి పైన ఫిర్యాదు చేస్తున్నామని వెంటనే ముఖ్యమంత్రి, డిజిపి స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, వికలాంగుల హక్కుల నాయకులు వినయ్, ఎమ్మార్పీఎస్ నాయకులు సందిగిరి నర్సింగ్‌రావు, కరెంటు శీను, రామచెర్ల నర్సింగ్, సీనియర్ రిపోర్టర్ మనోహర్, జి.కృష్ణ, కే.చందర్, ఆర్.గణేష్, పి.ప్రభాకర్, రాజు, చందర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఈనెల 20న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, పిఆర్‌ఓ పాషా తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలను కోరారు. ఈ శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలని క్లబ్ పిఆర్‌ఓ పాషా కోరారు.

అభివృద్ధికి అడ్డుపడటం రాజకీయ విజ్ఞత కాదు

ప్రజల గుండె చప్పుడు విని ప్రజా బడ్జెట్ పెట్టాం

రాష్ట్ర పురోభివృద్ధి కోసం 18 గంటలు కష్టపడుతున్నాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తూ ఆ రాజకీయం ద్వారా ప్రజలను ఇబ్బంది పెడుతూ అభివృద్ధి జరగకుండా అడ్డుపడాలనే ఆలోచన చేస్తే అది రాజకీయ విజ్ఞత అనిపించుకోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం నరసింహాపురం, బుచ్చిరెడ్డిపాలెం, బనగండ్లపాడు, తక్కెళ్ళపాడు, సకినవీడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎర్రుపాలెం మండలానికి చెందిన బిఆర్ ఎస్ నాయకులు వందల మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు వీరికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ కండువా కప్పు పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సొంత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చేయకుండా కాళ్లల్లో అడ్డుగా కట్టే పెట్టడం మంచి రాజకీయ నాయకుడి లక్షణం కాదు అని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని ఖర్చు వేసుకుంటూ ప్రజల అవసరాల కోసం పనిచేస్తూ ముందుకు పోతున్నదని వివరించారు. పాదయాత్రలో విన్న ప్రజల గుండె చప్పుడుని అంకెలుగా మార్చి ప్రజల సమస్యలను ఇబ్బందులను పరిష్కరించ డానికి ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో ప్రజా బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధికి బాటిల్ వేస్తున్నదని తెలిపారు. ప్రజలు ఇచ్చిన పదవులను బాధ్యతగా, సేవగా భావించి రాష్ట్ర అభివృద్ధి కోసం రోజుకు 18 గంటల పాటు ప్రజా ప్రభుత్వంలోని పాలకులు కష్టపడు తున్నారని వెల్లడించారు. ఓట్లు వేసిన ప్రజల రుణం తీర్చుకోవడానికి వెన్నులో భయం పెట్టుకొని బాధ్యతతో ప్రజల అవసరాల కోసం పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉంటున్నామని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో చేయలేని రుణమాఫీని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేవలం ఏడాదిలోనే రాష్ట్రంలోని రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీకి 22 వేల కోట్ల రూపాయలను ప్రజా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రైతు బంధు డబ్బులు ఇవ్వకుండా బిఆర్ఎస్ ఎగ్గొట్టిన డబ్బులను అధికారం లోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఒకే రోజు రూ.7,624 కోట్లు జమ చేసిందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములు అన్నింటికీ రైతు భరోసా ఈనెల 26 నుంచి ఇస్తున్నామని ఇస్తున్నామని, రూ.8400 కోట్ల రూపాయలు రైతు భరోసా డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయబోతున్నట్టు ప్రకటించారు. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబా లకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ. 12వేల రూపాయలు ఇస్తామని, ఈనెల 26 తర్వాత మొదటి విడత ఇన్స్టాల్మెంట్ డబ్బులు లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామని వెల్లడించారు. డైట్ చార్జీలు పెంచకుండా గాలికి వదిలేస్తే విద్యార్థుల భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తుగా ఆలోచించి 40 శాతం డైట్ చార్జీలు పెంచడంతో పాటు 200శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించి పాఠశాలల నిర్మాణాలకు పనులు మొదలు పెట్టినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి ఏడాది లోపు 56 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు.

విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర- హైదరాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరుగులు పెట్టిస్తున్నారు. నియోజకవర్గంలోని అక్కన్నపేట్, హుస్నాబాద్ మండలాల్లో 15.39 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమా లకు శంఖుస్థాపనలు చేశారు. అక్కన్నపేట మండలం బోడిగెపల్లి గ్రామంలో 1.5 కోట్లతో పిడబ్ల్యుడి రోడ్డు నుండి బోడిగపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బంజారాహిల్స్ తండాలో తాగునీటి పైప్ లైన్లు, నల్లాలను ప్రారంభించారు. గౌరవెల్లి పంచాయతీ పరిధిలోని సేవలల్ కాలనిలో వాటర్ ట్యాంక్, మంచినీటి పైప్ లైన్‌ను ప్రారంభించారు. సేవలాల్ మహారాజ్ తండాలో నూతన తండా-2 వద్ద ఒహెచ్ఎస్ఆర్, పైప్‌లైన్ ప్రారంభించారు. తుక్కితండాలో 58 లక్షలతో జడ్పీ రోడ్డు నుండి తుక్కితండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గండిపల్లి గ్రామంలో జడ్పీ రోడ్డు రూ.1.54 కోట్లతో వయా దెక్యా నాయక్ తండా మీదుగా శ్రీరాంతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గండిపల్లి సరేరం క్రాస్ వద్ద కుందనవారి పల్లి నుండి రూ.1.89 కోట్లతో వయా చౌటకుంట తండా సీతారం తండా మీదుగా గండిపల్లి క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కన్నపేట మండలం మంజు నాయక్ తండా వద్ద రూ.1.81 కొట్ల రూపాయలతో పిడబ్ల్యూడి రోడ్డు నుండి వయా బోజర వాగు తండా, చౌడ తండా, మంజునాయక్ తండా మీదుగా వరంగల్ బోర్డర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి బంజారా మహిళలతో కలిసి నృత్యం చేశారు. హుస్నాబాద్ మండలం హనుమాన్ నగర్, పోతారం (ఎస్) గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ మంచి నీటి పైప్ లైన్ నల్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కుచనపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, జడ్పీ రోడ్డు నుండి మాలపల్లి వయ కూచనపల్లి వరకు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన ఎస్టీ కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. పొట్లపల్లిలో రూ.3.95 కోట్లతో పందిల్ల స్టేజి నుండి పొట్లపల్లి మీదుగా హుస్నాబాద్ వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. తోటపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంఖు స్థాపన, ఓపెన్ జిమ్, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గౌరవెల్లి నిర్వాసితుల సమస్యలను పరిష్కారం చేస్తామని గౌరవెల్లి , గండిపల్లి ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు అందిస్తామని వెల్లడించారు. సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి,వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపల్ కౌన్సిలర్లు మండల అధ్యక్షులు, ఆర్డీవో, ఎమ్మార్వో ఇతర అధికారులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై

ఫిబ్రవరి 5న నిరసనలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏఐటీయుసి రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్ అధ్యక్షతన సత్యనారాయణ రెడ్డి భవన్, హిమాయత్‌నగర్‌లో జరిగింది. దేశంలో బడా కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తుల అండదండలతో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన అహంకారపూరిత, పాశవిక, ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగించటాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. 2025-26 బడ్జెట్‌లో అసంఘటితరంగ కార్మికుల ప్రయోజనాల కోసం కనీసం రూ. లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసింది. 4 లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 5న దేశవ్యాపితంగా జరుగు నిరసన ఆందోళనలో యావత్ కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూ లంగా కార్మిక చట్టాలను సవరిస్తూనే 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు పెంచుటకు అనుకూలంగా నిర్ణయించటం, వారానికి 70 గంటలు, 90 గంటలు పనిచేయాలంటూ కార్మికుల శ్రమదోపిడీకి ప్రోత్సహించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అసంఘటితరంగంలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామని చెపుతూ వచ్చిన మోడీ ప్రభుత్వం భద్రత కల్పించకపోగా కార్మిక హక్కులపై దాడులకు పాల్పడటాన్ని సమావేశం తీవ్రంగా ఖండిరచింది. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తి చేసుకున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన కొన్ని హామీలను అమలు పర్చుటకు కృషి చేస్తున్నప్పటికి ప్రధానంగా ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో జాప్యం చేయటాన్ని విడనాడి కనీస వేతన విధానాన్ని అమలు పర్చాలని, 73 షెడ్యూల్డ్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించి అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు పాలకమండలిని నియమించా లని, అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ బోర్డుకు పాలకమండలిలో కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఏఐటీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్‌రావు, బి.చంద్రయ్య, పి.ప్రేంపావని, కె.ఏసురత్నం, కార్యదర్శులు బి.వెంకటేశం, టేకుమల్ల సమ్మయ్య, కోశాధికారి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో విశ్వకవి యోగివేమన జయంతిని స్థానిక రాజా బహదూర్ రెడ్డి కన్వెన్షన్ నందు వేమన విగ్రహం దగ్గర పూలమాలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ సామల పాపిరెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గానికే కాకుండా అన్ని వర్గాల, అన్ని కులాల అభిమాన కవి మార్గదర్శకుడు, సామాజికవేత్త యోగి వేమన అని తెలిపారు. వేమన రాసిన అన్ని పద్యాలను సమీకరించి ఒక కావ్యంగా తయారు చేయాలని కవులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయిలో వేమన జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ సభ ద్వారా విజ్ఞప్తి చేశారు. అలాగే సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి నామకరణం చేయాలని కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయిలో రెడ్ల సమైక్యతకు, సంఘటీకరణ కొరకు సేవా భావంతో కూడిన స్వచ్ఛందంగా సేవలందించే ఒక రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు కావాలన్న దృఢ సంకల్పంతో తాము కృషి చేస్తున్నామని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మాట్లాడుతూ యోగివేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతామని తెలిపారు. అనంతరం పాలమూరు రెడ్డి సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణకు అతిధులు సామల పాపిరెడ్డి, బెక్కరి అనితమధుసూధన్ రెడ్డి మద్ది అనంతరెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి తన కార్యవర్గంతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు రెడ్డి సేవ సమితి 23వ వార్షికోత్సవం మార్చి 9వ తేదీన నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి , ప్రచార కార్యదర్శి సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, గౌరవ సలహాదారు పోతుల రాఘవ రెడ్డి, మద్దియాదిరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కృష్ణారెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకట్ రెడ్డి, లింగారెడ్డి, దశరథ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సరస్వతి, స్వరూప, శోభ, అనిత, హేమలత, రమాదేవి మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లో ప్రెజర్ నీటి సమస్యకు వాల్వు ఏర్పాటు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో గత కొద్ది రోజులుగా మంజీరా వాటర్ లోప్రెజర్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి జలమండలి అధికారుల దృష్టికి తీసుకెల్లి జవహర్ నగర్ కాలనిలో వాల్వు ఏర్పాటు చేయించారు. ఆదివారం కార్పొరేటర్ కాలని వాసులతో కలిసి వాల్వును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ సొసైటీ అధ్యక్షులు నారాయణ, సెక్రటరీ జాన్, ఉపాధ్యక్షులు కాశిరెడ్డి, ట్రెజరర్ ముత్యంరెడ్డి, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, జగన్ మోహన్ రెడ్డి, భాస్కర్, మల్లేష్ గౌడ్, బాలకిషన్, మాధవి, లక్ష్మి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లు 20, 24, 26 వార్డులలో రూ.2 కోట్ల 80 లక్షల నిధులతో సిసి రోడ్లు, పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఉదయం శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమాలు మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి మా ప్రాధాన్యత అన్నారు. డ్రైనేజీ, సిసి రోడ్లు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదల ద్వారా ప్రజలకు మంచి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం" అని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సమర్థవంతంగా వినియోగించుకొని, ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, డిఈ సాయినాథ్ గౌడ్, స్థానిక కార్పొరేటర్లు కౌడే పోచయ్య, ఎంపల్ల అనంతరెడ్డి, పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు, డివిజన్ల సీనియర్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : పసుపు బోర్డు ఏర్పాటును బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. అయితే, క్వింటాలు పసుపుకు రూ. 15 వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని సూచించారు. ఈ రెండు చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పాడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. తూతూమంత్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం కాదని, అందుకు తగిన సౌకర్యాలు, పరిశోధన సమర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలని సూచిం చారు. పసుపు బోర్డునే ఏర్పాటు చేయాలని తాము కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని గుర్తు చేశారు. తాము పసుపు బోర్డుపై డిమాండ్ చేసినప్పుడు బీజేపీ ఎంపీ అర్వింద్ రాజకీయాల్లో కూడా లేరని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని, ప్రొటొకాల్ ను పాటించలేదని, ఇది ప్రభుత్వ నియమనిబంధనలను విరుద్ధమని స్పష్టం చేశారు.

కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని, స్థానిక ప్రజాప్రతినిధు లకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బోర్డు ఏర్పాటు మాత్రమే కాకుండా కనీస మద్దతు ధరను ప్రకటించాలని, దిగుమతులపై నియంత్రణ విధించాలని కూడా కేంద్రానికి అనేక సార్లు వినతులు అందించామన్నారు. 2014లో 8 లక్షల క్వింటాళ్లు దిగుమతవుతే ఇప్పుడు రెట్టింపయ్యిందని చెప్పారు. ఏటేటా దిగుమతులు పెరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

రకరకాల మాటలతో రైతులను, ప్రజలను మభ్యపెట్టిన బీజేపీ ఎంపీ అర్వింద్‌పై విరుచుకు పడ్డారు. గాలి మాటలు మాట్లాడడం మానేసి పసుపుకు మద్దతు ధర సాధించాలని ఎంపీ అర్వింద్‌కు సూచించారు. స్పైసెస్ బోర్డును బెంజ్ కారులాంటిదని, పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదని గతంలో అర్వింద్ అన్నారని, పసుపును అవహేళన చేసిన అర్వింద్‌కు ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఎంపీగా గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని అర్వింద్ బాండ్ పేపర్ పై రాసిచ్చారు. తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడం వల్లే గతంలో స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటైందని, అది కూడా ఆయన గొప్పతనమని అర్వింద్ మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలుపండి

చారి

పై ఫొటోలో వున్న వ్యక్తి ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ కాందగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతనికి బంధువులు ఎవరూ లేరని తెలిపాడు. ఇతని పేరు చారి అని చెప్పాడని, ఇతని మృతి పట్ల ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నచో భువనేశ్వర్ కాందగిరి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, ఎవరైనా గుర్తిస్తే లారీ యజమాని కన్నబోయిన గోపాలకృష్ణ, ఫోన్ నెం. 7056689999ను సంప్రదించవచ్చు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

హౌసింగ్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కూడు, గూడు, గుడ్డ, గరీబీ హటావో నినాదంతో ఇందిరమ్మ పేదల గుండెల్లో కొలువైందని, అలాంటి ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ, క్యాలండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశల వారీగా రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసిందని, ఈ నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఈ శాఖను పునరుద్ధరించి లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుందని అన్నారు. 326 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గ్యారెంటీలు పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది మంది నీడలేని పేదలకు ఐదు లక్షల రూపాయల స్కీమ్‌తో పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది అని దానికి గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పూర్తిగా సహకరించాలని, మరింత కష్టపడి పని చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ రవీందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట రామిరెడ్డి, సీనియర్ నాయకులు కంది రవీందర్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, కుమార్, రమేష్, రఘు, లింగయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలు వేలం

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : వివిధ రకాల కారణాలతో సీజ్ చేసిన వాహనాలను ఇబ్రహీంపట్నం రవాణా శాఖ అధికారులు వేలం వేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని ఇబ్రహీంపట్నం రవాణా శాఖ కార్యాలయంలో 178 వాహనాలను అధికారులు వేలం వేశారు. రవాణా కార్యాలయం, ఆర్టీసీ 5 డిపోల్లో వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి 55,06,500 రూపాయల వసూలు జరిగిందని ఆర్టీఏ సుభాష్ చంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు..

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ మణికంఠ నగర్ కాలనీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 40మంది బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం మేడ్చల్ నియోజకవర్గం, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ వారికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాలనీవాసులు ప్రభాకర్ రెడ్డి, సంతోష్‌గౌడ్, ప్రతాప్ రెడ్డి, నర్సింహారెడ్డి, కొండల్ యాదవ్, బ్రమ్మాచారీ, రాజేశ్వర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వెంకటేష్, యాదగిరి రెడ్డి, 40 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్త, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

రిపోర్టర్ ఎర్రం రమేష్ మృతి

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : హైదరాబాద్‌లోని అమీర్ పేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ఎర్రం రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం భౌతిక కాయాన్ని వెంగళరావునగర్‌లోని అతను నివాసం ఉంటున్న ఇంటికి తీసుకువెళ్ళి, అక్కడి నుంచి అతని స్వస్థలం ఏపీలోని నరసరావుపేట దగ్గర జొన్నలగడ్డకు తీసుకు వెళతారు. రమేష్ ప్రస్తుతం యూసుఫ్ గూడ ఏరియా ఆంధ్ర జ్యోతి రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో దాదాపు 12 ఏళ్ళ పాటు ఈనాడులో బేగంపేట ఏరియా రిపోర్టర్‌గా పనిచేశారు. రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన హైదరాబాద్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యుడు కూడా. రమేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చిత్తారమ్మ దేవి ఆలయంలో కొలను పూజలు

విశాలాంధ్ర-దుండిగల్: శ్రీ చిత్తారమ్మ దేవి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మ దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న దేవాలయ స్వర్ణోత్సవ వేడుకల కార్యక్రమానికి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ చిత్తారమ్మ దేవి అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, కోలన్ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిద్దనోల సంజీవరెడ్డి, పాలకృష్ణ, రాజేందర్ రెడ్డి, బల్ రెడ్డి అవిజె హన్మంతు, శ్రీధర్ వర్మ, శ్రీకాంత్, వేణు గౌడ్ సరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఎన్నారైల పాత్ర కీలకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిర్మాణాత్మక ప్రతిపక్షంలో ఎన్నారైలు పాత్ర చాలా కీలకమని మాజీ ఎంపీ.వినోద్ కుమార్ అన్నారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే నూతన కార్యవర్గం తమ మొదటి సమావేశాన్ని జూమ్ కాల్ వేదిక నిర్వహించడం జరిగింది. ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో జూమ్ కాల్ వేదిక ఆన్లైన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, అలాగే నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఎన్నారైల పాత్ర వంటి అంశాలపై దిశా నిర్దేశం చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఎఫ్డీసి మాజీ చైర్మన్, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం కూడా ఈ సమావేశంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నారైలతో ఇలా కలుసుకోవడం ఆనందంగా వుందనీ, కెసిఆర్ 2001లో టీ.ఆర్.యస్ పార్టీ ఆవిర్భావ సమయంలో తెలంగాణ ఉద్యమానికి ఎల్లప్పుడూ వెనుదన్నుగా నిలబడ్డది ఎన్నారైలే అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి, కెసిఆర్ సీఎంగా లేని తెలంగాణను ప్రజలు ఊహించుకోలేక పోతున్నారని, వారి నాయకత్వాన్ని కోల్పోయినందుకు ప్రజలు బాధపడుతున్నట్లు వినోద్ తెలిపారు. కెసిఆర్ నాయత్వంలో అన్ని రంగాల్లో మనం ఎంతో అభివృద్ధి సాధించామని, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ సంస్థలు లెక్కలతో సహా మన అభివృద్ధిని అభినందిస్తూ అవార్డ్స్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుతం తెలంగాణ దేశంలో చెప్పుకోతగ్గ స్థాయిలో లేదని తెలిపారు. మళ్ళీ వచ్చేది మన ప్రభుత్వమేనని అప్పటి వరకు ప్రజా సమస్యలను తీసుకొని ముందుకు వెళ్లాలని, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఎన్నారైలంతా వివిధ అంశాలని ప్రజలకు తెలిసేలా ప్రభుతాన్ని ప్రశ్నించాలని తెలిపారు. ఎన్నారై బీ.ఆర్.యస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం సభ్యులందరితో మాట్లాడారు. ఎన్నారై బీ.ఆర్.యస్ సెల్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ కూర్మాచలం, అధ్యక్షులు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులు హరి గౌడ్ నవాపేట్, సతీష్ రెడ్డి గొట్టిముక్కుల, సత్య మూర్తి చిలుముల, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కడుదుల, అడ్వైసరీ బోర్డు వైస్ చైర్మన్ శ్రీకాంత్ జెల్ల, గణేష్ కుప్పాల, కార్యదర్శులు సతీష్ రెడ్డి బండ, సురేష్ గోపతి, అబ్దుల్ జాఫర్, కార్యదర్శి ఐటీ, మీడియా, పీఆర్ రవి ప్రదీప్ పులుసు, కమ్యూనిటీ అఫైర్స్ చైర్మన్ రమేష్ ఇస్సంపల్లి, లండన్ ఇంచార్జ్ సత్యపాల్ రెడ్డి పింగలి, సంయుక్త కార్యదర్శులు నవీన్ మాదిరెడ్డి, ప్రశాంత్‌రావు కటికనేని, రామకృష్ణ కలకుంట్ల, సోషల్ మీడియా కన్వీనర్స్ సాయిబాబా కోట్ల, అంజన్‌రావు, ఈవెంట్స్ ఇంచార్జ్ తరుణ్ లునావత్, ముఖ్య సభ్యులు పవన్ గౌడ్, నర్సింగరావు వున్నారు.

మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లకు వినూత్న మెట్రో మార్గాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రెండవ దశలో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు శ్రీకారం రాష్ట్ర ప్రభుత్వం చుట్టబోతోంది. ముఖ్యంగా మేడ్చల్, శామీర్ పేట్ దిశగా సాగే కారిడార్లు కొత్త రూపురేఖలు సంతరించుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు హైదరాబాద్ ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణానికి కొత్త మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును ప్రారంభించారు. ప్యారడైజ్ - మేడ్చల్ (23 కి.మీ)టీ జేబీఎస్-శామీర్‌పేట్ (22 కి.మీ) ప్రతిపాదిత కారిడార్ అలైన్మెంట్ ల విషయంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదారులు ఆదివారం క్షేత్ర పరిశీలన జరిపారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఇంజినీరింగ్ పరంగా ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు. బేగంపేట్ విమానాశ్రయ సరిహద్దు వెంబడి ప్యారడైజ్ నుండి బోయినపల్లి వరకు రోడ్డు వంపు చాల ఎక్కువగా ఉండటం మరియు విమానాశ్రయ అధికారుల ఆంక్షల కారణంగా, హెచ్ఎండీఏ తన ఎలివేటెడ్ మార్గాన్ని కొంత దూరం పాటు భూగర్భ మార్గంగా మార్చుకుంది. ఈ అలైన్‌మెంట్‌ను బేగంపేట విమానాశ్రయం (తాడ్‌బండ్, బోయినపల్లి వైపు) రన్‌వే క్రింద దాదాపు 600 మీటర్ల దూరం భూగర్భ సొరంగం ద్వారా తీసుకువెళ్తుంది. ముఖ్యమంత్రి సూచించిన ప్రకారం మేడ్చల్, శామీర్ పేట్ కారిడార్‌ల ప్రారంభం స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేయడం, ఇక్కడ ప్రపంచ స్థాయిలో ఒక హబ్‌ని ఏర్పాటు చేయడం, ఈ కారిడార్లు కొంత దూరం వెళ్లిన తర్వాత వాటిని విడదీసి, రెండు మెట్రో కారిడార్లు గా రూపొందించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని తన క్షేత్ర పర్యటనను ఎన్.వి.ఎస్. కొనసాగించారు. తన బృందంతో కలిసి కంటోన్మెంట్ ప్రాంతంలోని అనేక ప్రత్యామ్నాయ రోడ్లపై పూర్తిగా నడిచి, సాధ్యమైనంత ఉత్తమమైన మెట్రో రైలు అలైన్‌మెంట్ ఏర్పాటుకు పరిశీలనలు జరిపారు. జేబీఎస్ - సికింద్రాబాద్ క్లబ్‌రోడ్, స్టాఫ్ రోడ్ (పికెట్ కేంద్రీయ విద్యాలయ స్కూల్ రోడ్), మడ్ ఫోర్ట్ రోడ్, టివోి జంక్షన్ రోడ్, డైమండ్ పాయింట్ జంక్షన్, సెంటర్ పాయింట్ జంక్షన్, హస్మత్‌పేట్ జంక్షన్, బోయినపల్లి (సరోజిని పుల్లారెడ్డి బంగ్లా) రోడ్, తాడ్‌బండ్-ఆంజనేయస్వామి ఆలయం రోడ్ - తాడ్‌బండ్ జంక్షన్ - ఎయిర్ పోర్ట్ ఆఫీస్ జంక్షన్ - బోయినపల్లి చెక్ పోస్ట్ రోడ్ మొదలైనవి వీరు పరిశీలించిన మార్గాలలో ఉన్నాయి. క్లిష్టమైన మలుపులను, విమానాశ్రయం కింద భూగర్భంలో అలైన్‌మెంట్ ను తీసుకువెళ్లే ఆవశ్యకతను నివారించే విధంగా, ప్రైవేట్ ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్టుగా జేబీఎస్ వద్ద ప్రారంభంలో రెండు మెట్రో కారిడార్‌లను కలపడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ఎన్.వి.ఎస్.రెడ్డి వెల్లడించారు. దీనివల్ల బేగంపేట్ విమానాశ్రయం దిగువన సొరంగం ద్వారా మెట్రో అలైన్‌మెంట్‌ను తీసుకెళ్లాల్సిన పరిస్థితిని నివారించి, బోయినపల్లి రోడ్ చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని, అక్కడ నుండి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను, వయాడక్టును జాతీయ రహదారుల సంస్థ నిర్మిస్తున్న ఫ్లైఓవర్ లకు అంతరాయం కలగకుండా నిర్మించవచ్చని అన్నారు. హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్లు బి.ఎన్. రాజేశ్వర్, ఎం. విష్ణు వర్ధన్ రెడ్డి, ఎ.బాలకృష్ణ, డిప్యూటీ సిఇ (రైల్వేస్) జె.ఎన్. గుప్తా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ పై సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఇచ్చిన భారత పార్లమెంట్లో చర్చ జరకుండా రాష్ట్ర లలో వర్గీకరణ చేయకూడదని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు ప్రొ.డా.వి.ఎల్. రాజు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత జాతులను సామాజికంగా రాజకీయంగా అణిచివేసి బానిసలుగా చేసుకోవడానికే కేంద్ర, రాష్ట్ర పాలకులు దోపిడీ కుల పార్టీలు కుట్రలు చేశాయన్నారు. ప్రధానంగా డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ వాదంను ధ్వంసం చేయాలని ఏంఆర్పిఎస్‌తో చేతులు కలిపిన మనువాద పార్టీలు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కులను కాలరాయడం కోసమే సుప్రీంకోర్టు ద్వారా నరేంద్ర మోడీ సర్కార్ తీర్పు ఇప్పించారాని ఆరోపించారు. 59 ఎస్సీ కులాల, ఉప కులాల జనాభా లెక్కలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగ్గర లేవన్నారు. వర్గీకరణ అంశం అనేది యావత్ దళిత కులాల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు లాంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. దీని కోసం రేవంత్ రెడ్డి నియమించిన షమీర్ అక్తర్ చైర్మన్‌గా ఏక సభ్య కమిషన్ ఇచ్చే వర్గీకరణ అనుకూల సిఫార్స్ లను ఉన్నతి న్యాయ స్థానల్లో సవాల్ చేయవలిసిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు సమాయతం కావాలన్నారు. అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరమ్ చైర్మన్ సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు సిలివెరి వసంతరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రాజలింగం నేతకాని, రాష్ట్ర ఉపా అధ్యక్షులు ఎమ్. రవీందర్ నాయక్, విశ్వనాధం, రమేష్, ప్రసన్నకుమార్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు జె.ఎన్.రావు, దళిత బహుజన పార్టీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు పాల్గొన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తూరు : నేటి సమాజంలో యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలోని విక్టరీ క్రీడా మైదానంలో ఆదివారం స్థానిక తాజా మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ రూ.2 లక్షలు సహకారంతో నందిగామ ప్రీమియర్ లీగ్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్ 2025ను యువకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్, మాజీ జెడ్పిటిసి మామిడి శ్యామ్‌సుందర్ రెడ్డి, ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ మంచన్ పల్లి శివశంకర్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగ వారు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ముందుకొస్తే తాను సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో క్రీడారంగం అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రూ.2 లక్షలు అందజేసిన మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణను ఎమ్మెల్యే అభినందించారు. నందిగామ సిఐ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహులు యాదవ్, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు జి.హరినాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమారస్వామి గౌడ్, చంద్రపాల్ రెడ్డి, కృష్ణ, రాంరెడ్డి, కృష్ణ గౌడ్, యాదయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ చారి, ఎస్టి సెల్ శ్రీను నాయక్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను బహిర్గతం చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే వివరాలను తక్షణమే బహిర్గత పరచాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులలోపు సర్వే వివరాలను ప్రకటిస్తామన్నామని, చెప్పి సమగ్ర సర్వే చేసి రెండు నెలలు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే వివరాలను ప్రకటించకుండా జాప్యం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీని కాంగ్రెస్ పార్టీ అమలు పరచాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్న వారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ నుండి కోటేశ్వరమ్మ మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా సెక్రటరీగా ఎన్నిక అయిన సందర్భంగా ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సంతోషం వ్యక్తం చేస్తూ కోటేశ్వరమ్మని శాలువాతో సత్కరించి రానున్న రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి యూత్ కాంగ్రెస్ లీడర్ కొలన్ బాల్ రెడ్డి, మౌలేశ్వరరావు, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో ప్రొఫైలాక్సిస్ ప్రివెంటివ్ హెల్త్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ ప్రొఫైలాక్సిస్ ప్రివెంటివ్ హెల్త్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. ఇది ప్రాజెక్ట్ కార్ట్ బ్లాంశ్‌కి అనుబంధంగా టెక్ అవాంట్-గార్డ్ (టీఏజీ), కార్ట్ బ్లాంశ్ రిజిస్టర్డ్ స్కూల్స్, ఫిషర్ మెడికల్ వెంచర్స్‌తో కలిసి చేపట్టిన ఒక పునాదిపరమైన చర్య అన్నారు. ఈ ప్రోగ్రామ్ మొత్తం పాఠశాల సముదాయం శారీరక, మానసిక సంక్షేమాన్ని మెరుగుపర్చడానికి డిజైన్ చేయబడిన ఒక సమగ్ర యత్నం అన్నారు. ఇందులో అడోలసెంట్ హెల్త్ ప్రోగ్రామ్, ఫిజికల్ హెల్త్ కియోస్క్, మానసిక ఆరోగ్య మద్దతు సేవలు, కౌన్సెలింగ్ కియోస్క్, టెలిమెడిసిన్ సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రొఫైలాక్సిస్‌కు చెందిన డా.జుగల్ కిశ్సోర్ (ఎంబీబీఎస్, ఎంఏఎంసీ, ఎండీ-కమ్యూనిటీ మెడిసిన్, ఏఐఐఎంఎస్) వర్చువల్గా పాల్గొన్నారు. గెస్ట్ ఆఫ్ హానర్‌గా డా.మేఘనా (ర్యూమటాలజిస్ట్), డా.అపర్ణ (గైనకాలజిస్ట్) శారీరక ఆరోగ్య కియోస్క్ పరికరాన్ని ప్రారంభించి, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఇది విద్యార్థుల ఆరోగ్యానికి, కుటుంబ సంక్షేమానికి మార్పును తీసుకొచ్చే అవకాశం కలిగి ఉందన్నారు. టాగ్ సీఈఓ అలి సైత్ మాట్లాడుతూ డిజిటల్ ఇన్నోవేషన్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్‌ను ముందుకు తీసుకు పోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని, అలాంటి కార్యక్రమాలను మద్దతు ఇవ్వడంలో కీలకమైనదని తెలిపారు. ఈ పరికరం నివారణ ఆరోగ్య పరిష్కారాలలో ఒక అద్భుతమైన ముందడుగును సూచిస్తుందన్నారు.

ఉప్పల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి

విశాలాంధ్ర - కాప్రా : నూతన సంవత్సరం క్యాలెండర్‌ను భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జన్‌శేఖర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్రంలోనే ఉప్పల్ నియోజకవర్గం ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. అంతేకాకుండా బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు చదివేందుకు ఎంతోమంది ఎంబిబిఎస్ సీట్లు సాధించుకొని ఫీజులు కట్టలేని విద్యార్థులను బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫీజులు కడుతున్నామని అలాంటి విద్యార్థులు ఇంకా ఎవరైనా ఉంటే వారికి కూడా సహకరిస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బిరారెడ్డి, హరినాథ్ రెడ్డి, చెంచారం కృష్ణారెడ్డి, రాయుడు, భవాని, అశోక్, పిసర్ల విష్ణువర్ధన్ రెడ్డి, వరకాల మధుసూదన్ రెడ్డి, గోల్డ్ రమేష్, భాస్కర్ చారి, జావాజీ శ్రీధర్ రెడ్డి, గంగిశెట్టి నవీన్ గౌడ్, నమిలికొండ భూపాల్ రెడ్డి, వీర ప్రతాప్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, టి రామచంద్ర, హేమంత్ రెడ్డి, పిసిఎస్ చారి, రాములు, వెంకటేష్, ఏ పాండురంగం, భాస్కర్ రెడ్డి, టెలిఫోన్ రమేష్, సురేందర్, జనార్దన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళ కాంగ్రెస్‌లో సభ్యత్వం ఆధారంగానే పదవులు



విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : మహిళ కాంగ్రెస్‌లో సభ్యత్వం ఆధారంగానే పదవులు కట్టబెడుతున్నట్లు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు స్పష్టం చేశారు. షాపూర్‌నగర్‌లోని శుభం హోటల్ మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నియామకాలను ఆమె ప్రకటించారు. పలువురికి నియామక పత్రాలను అందజేశారు. సునీతారావు మాట్లాడుతూ కష్టపడి పని చేసిన మహిళలకు పిసిసితో పాటు ప్రభుత్వ నామినేటెడ్ పదవులను కేటాయించాలని కోరారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో 30 మంది మహిళల జాబితాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్లకు అందజేసినట్లు తెలిపారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చింతల నిర్మలారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులుగా జాజాల రమ్య, మెరుగు సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలుగా జ్యోతి, జిల్లా సంయుక్త కార్యదర్శిగా శోభారాణి, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షురాలిగా జూపల్లి శోభారాణి, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షురాలిగా ఖనీస్ ఫాతిమా, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలిగా మాధవి, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రామగల్ల రమాదేవి, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్యరాణి, 121 డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూర్పుటి కృష్ణవేణి,114 మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పొన్నం రజిత, 116 డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జోజమ్మ, 115 డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మారుతి,117 డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భారతమ్మ, 118 డివిజన్ అధ్యక్షురాలు జ్యోతి, 119 డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కుత్బుల్లాపూర్ బి బ్లాక్ అధ్యక్షురాలిగా సాంటీరెడ్డి చైతన్య రెడ్డి, కుత్బుల్లాపూర్ బి బ్లాక్ ఉపాధ్యక్షురాలుగా యాస్మిన్ బేగం, 129 డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమ్మాజిలకు నియామక పత్రాలను అందజేశారు.

మూసిన తలుపులు తెరవడంలో

విజయం సాధించాం

కేంద్రంతో సమావేశంపై రైతు నాయకులు

చండీగఢ్ : 'ఇది మాకు పెద్ద విజయం కాదు. కానీ మూసిన తలుపులు తెరవడంలో మేము విజయం సాధించాం' అని ఫిబ్రవరి 14న చండీగఢ్‌లో తమ డిమాండ్లను చర్చించడానికి సమావేశం నిర్వహించాలని కేంద్రం ఇచ్చిన ఆహ్వానంపై పంజాబ్ రైతు నాయకులు అన్నారు. నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ చివరి వరకు వైద్య సహాయం తీసుకోవడానికి నిరాకరించారని, కానీ రైతు నాయకులు ఆయనను నిరంతరం అభ్యర్థించడంతో 'మీకు సరైనది అనిపించేది చేయండి' అని ఆయన విచారంతో వారితో అన్నారని తెలిపారు. మొత్తం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని దలేవాల్‌కు వైద్య సహాయం ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు వారు చెప్పారు. 'ఇది పెద్ద విజయం అని చెప్పలేం. కానీ మేము ఒక అడుగు ముందుకు వేసామని చెప్పగలం. మేము (కేంద్రం నుంచి) సమావేశం ఏర్పాటు చేయడంలో విజయం సాధించాం. చర్చల కోసం మూసివేసిన తలుపు తెరవడంలో విజయం సాధించాం' అని రైతు నాయకుడు కాకా సింగ్ కోత్రా అన్నారు. ఆదివారం ఖనౌరి సరిహద్దు వద్ద విలేకరులతో మాట్లాడిన రైతు నాయకులు... సమావేశం కోసం నిర్ణయించిన తేదీ ఫిబ్రవరి 14 చాలా దూరంలో ఉన్నందున సమావేశం ముందుగానే నిర్వహించాలని ప్రతినిధి బృందం నుంచి డిమాండ్ చేశామని తెలిపారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో సన్నాహాల కోసం మంత్రులు, అధికారులను నియమించామని అధికారులు రైతులకు చెప్పారు. రెండవది, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 9 వరకు నమూనా ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని రైతు నాయకుడు అభిమన్యు కోహార్ అన్నారు. సమావేశం మొదటి రౌండ్ చండీగఢ్‌లో జరుగుతుందని, తదుపరి దశ ఢిల్లీలో జరుగుతుందని ప్రతినిధి బృందం తమకు చెప్పిందన్నారు. సమావేశానికి ఆహ్వానంతో వచ్చిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం సభ్యులు... దలేవాల్ ప్రతిపాదిత సమావేశంలోనే ఉండాలని నొక్కి చెప్పారని ఆయన వివరించారు. అయితే రైతుల డిమాండ్లు నెరవేరే వరకు దలేవాల్ నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుందని రైతు నాయకులు స్పష్టం చేశారు. జనవరి 26న ట్రాక్టర్ మార్చ్ చేపట్టే తమ కార్యక్రమం కచ్చితంగా ఉంటుందని చెప్పారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన ఎస్‌కేఎం

రైతులతో చర్చలు జరపాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను సంయుక్త కిసాన్ మోర్చా ఆదివారం గొప్ప విజయంగా అభివర్ణించింది. వైద్య సహాయం పొందాలనే నిరాహార దీక్ష రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇప్పుడు రద్దు చేయబడిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020-21 రైతుల నిరసనలకు నాయకత్వం వహించిన బృందం, రైతుల పెరుగుతున్న ఐక్యత కారణంగా ప్రభుత్వం చర్చలు జరపవలసి వచ్చిందని పేర్కొంది. 'దలేవాల్ త్వరగా కోలుకుని, మంచి ఆరోగ్యం పొందాలని కోరుకుంటున్నాం. రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల ఐక్యత, దేశవ్యాప్త ఆందోళన కోసం ఎస్‌కేఎం నాయకులు చేసిన నిరంతర ప్రయత్నాలు ప్రభుత్వం తన విభజన వ్యూహం నుంచి వెనక్కి తగ్గేలా చేశాయి' అని తెలిపింది. సోమవారం ఎంపీ కార్యాలయాల వద్ద కిసాన్ ధర్నా నిర్వహించే బదులు పార్లమెంటు సభ్యులకు ఇ-మెయిల్ ద్వారా వినతి పత్రాలను పంపాలని రైతు సంఘం తన అన్ని యూనిట్లకు పిలుపునిచ్చింది. జనవరి 26న ఎస్‌కేఎం నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీలపై దృష్టి పెట్టాలని కోరింది.

దీక్ష విరమించిన 121 మంది రైతులు

ఖనౌరీ నిరసన స్థలంలో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్‌కు సంఘీభావంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన 121 మంది రైతుల బృందం ఆదివారం ఆయన వైద్య సహాయం తీసుకున్న తర్వాత నిరవధిక దీక్షను ముగించింది. ప్రభుత్వం వారి డిమాండ్లకు అంగీకరించకపోవడంతో జనవరి 15న దలేవాల్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలో 111 మంది రైతుల బృందం చేరి, ఖనౌరీ సమీపంలో సరిహద్దులోని హర్యానా వైపు కూర్చున్నారు. జనవరి 17న హర్యానాకు చెందిన మరో 10 మంది రైతులు వారితో చేరారు. కాగా, ఆదివారం పోలీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మన్దీప్ సిద్ధూ, పాటియాలా పోలీస్ సీనియర్ సూపరింటెండెంట్ నానక్ సింగ్ సమక్షంలో రైతులు పండ్ల రసం తీసుకుని నిరాహార దీక్షను ముగించారు. అయితే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇచ్చే వరకు దలేవాల్ తన నిరాహార దీక్షను విరమించబోనని రైతు నాయకులు తెలిపారు.

ఫిబ్రవరి 14న కాకుండా త్వరగా చర్చించాలి : పంజాబ్ మంత్రి

కేంద్రం ఉద్దేశాలు సరైనవైతే, ప్రస్తుతం నిర్ణయించిన ఫిబ్రవరి 14న కాకుండా, నిరసన తెలుపుతున్న రైతులతో వీలైనంత త్వరగా సమావేశం నిర్వహించాలని పంజాబ్ వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుడ్డియాన్ ఆదివారం అన్నారు. 'నవంబరు 26 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉంది. వారి (కేంద్రం) ఉద్దేశాలు సరైనవైతే, వారు ఒకటి లేదా రెండు రోజుల్లో చర్చలు జరపాలి' అని తెలిపారు.

న్యాయం... సమానత్వం కోసం

రాహుల్ 'వైట్ టీ-షర్ట్' ఉద్యమం ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం 'వైట్ టీ-షర్టు ఉద్యమం' ప్రారంభించినట్లు ప్రకటించారు. ఇది ప్రజల హక్కులను కాపాడుతుందని పేర్కొంటూ, నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదలకు వెన్ను చూపుతోందని ఆయన ఆరోపించారు. 'ఎక్స్' పై ఒక పోస్ట్‌లో గాంధీ ఈ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలు దానిలో భాగం కావాలని కోరారు. 'మీకు ఆర్థిక న్యాయంపై నమ్మకం ఉంటే, పెరుగుతున్న సంపద అసమానతలపై వ్యతిరేకత, సామాజిక సమానత్వం కోసం పోరాడాలనుకుంటే, అన్ని రకాల వివక్షలను తిరస్కరించినట్లయితే, మన దేశంలో శాంతి, స్థిరత్వం కోసం ప్రయత్నిస్తే, మీ తెల్ల టీ-షర్టులు ధరించి ఉద్యమంలో చేరండి' అని గాంధీ 'ఎక్స్' పై పోస్ట్ చేసిన వీడియో వాయిస్‌ఓవర్‌లో పేర్కొన్నారు. 'ఈ రోజు మోదీ ప్రభుత్వం పేదలు, కార్మిక వర్గానికి వెన్ను పొడిచి వారిని ఇష్టారాజ్యంగా వదిలివేసింది' అని గాంధీ అన్నారు. ప్రభుత్వం మొత్తం దృష్టి ఎంపిక చేసిన కొంతమంది పెట్టుబడిదారులను సంపన్నం చేయడంపై ఉంది' అని తెలిపారు. దీని కారణంగా అసమానత నిరంతరం పెరుగుతోందన్నారు. 'దేశాన్ని తమ రక్తం, చెమటతో పోషించే' కార్మికుల పరిస్థితి మరింత దిగజారిపోతోందని, వారు వివిధ రకాల అన్యాయాలను, దారుణాలను భరించాల్సి వస్తోందని ఆయన అన్నారు. 'ఈ ఉద్యమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నా యువత, కార్మిక వర్గ సహచరులను నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ ప్రచారంలో చేరడానికి, దాని గురించి వివరణాత్మక సమాచారాన్ని పొందడానికి, ఈ లింక్‌ను సందర్శించండి...వైట్‌షర్ట్ డాట్ ఇన్/హోమ్/హిన్ లేదా 9999812024కు మిస్ కాల్డ్ ఇవ్వండి' అని ఆ పోస్ట్‌లో రాహుల్ కోరారు. 'వైట్ టీ-షర్ట్ ఉద్యమం' వెబ్‌సైట్ 'వైట్ టీ-షర్ట్' కేవలం వస్త్రం ముక్క కాదని, పార్టీకి చెందిన ఐదు మార్గదర్శక సూత్రాలకు చిహ్నం... కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, అందరికీ పురోగతి అని పేర్కొంది. 'ఈ విలువలు సామరస్యం, వైవిధ్యంపై ఆధారపడిన భారతదేశ 8000 సంవత్సరాల పురాతన నాగరికతకు చెందిన స్ఫూర్తిని ప్రతిధ్వనిస్తాయి. నేడు, ఆదాయం, కులం, మతంలో పాతుకుపోయిన పెరుగుతున్న అసమానతలు భావజాలానికి అతీతంగా చర్యను కోరుతున్నాయి' అని వెబ్‌సైట్ పేర్కొంది. 'మన నిబద్ధత ధర్మం, కర్మ తత్వశాస్త్రం నుంచి ఉద్భవించాలి. ధర్మం నిస్వార్థంగా సమాజానికి సేవ చేయడం విధి, అయితే కర్మ హక్కులను కాపాడటం, న్యాయం కోసం పోరాడాలనే సంకల్పం' అని వివరించింది. 'మనమందరం మార్పునకు ప్రతినిధులుగా ఉండి, ఈ జీవన విధానాన్ని గర్వంగా స్వీకరించుకుందాం. తెల్లటి టీ-షర్ట్ మన చిహ్నం... న్యాయమైన, ఏకీకృత భారతదేశం కోసం పిలుపు. దీనిని ధరించడం ద్వారా భారత్ జోడో యాత్ర లక్ష్యాలను ప్రతిధ్వనించే భారత్ జోడో స్ఫూర్తిని మనం గౌరవిస్తాం. విభజనలను తగ్గించడం, సంఘటిత, సమాన దేశాన్ని నిర్మించడం' అని పేర్కొంది.

తల్లి వద్దనుకున్న ఆ బిడ్డే... ఐఏఎస్

అన్ని అడ్డంకులపై పోరాడిన సంజితా మహాపాత్ర

అమరావతి (మహారాష్ట్ర): తల్లి వద్దనుకున్న బిడ్డే... నేడు ఐఏఎస్ అధికారిగా మారింది. సంజిత మహాపాత్ర ధైర్యం, దృఢ సంకల్పంతో అడ్డంకులను అధిగమిస్తూ విజయ యాత్ర కొనసాగిస్తోంది. మహాపాత్ర మహారాష్ట్రలోని అమరావతి జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారిగా జిల్లాలో విద్య, ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారించింది. కొన్ని రోజుల క్రితం ఒక విలేకరుల సమావేశంలో 34 అధికారిణి మహాపాత్ర మాట్లాడుతూ ఒడిశాలోని రూర్కెలాలో ఒక పేద కుటుంబంలో జన్మించానని, అయితే తన జననం తన అక్క తర్వాత మగ బిడ్డ కోసం ఆరాటపడిన తన తల్లిని నిరాశపరిచిందని చెప్పారు. తన కుటుంబం తనను దాదాపుగా విడిచిపెట్టిందని, కానీ తన అక్క పట్టుబట్టడంతోనే తల్లిదండ్రులు తనను ఉంచుకున్నారని వివరించారు. తన కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం వల్ల మహాపాత్ర బాల్యం అడ్డంకులతో నిండి పోయింది. ఆమె విద్యను పూర్తి చేయడానికి సామాజిక సంస్థలు, ఉపాధ్యాయులు, ఉపకారవేతనాలపై ఆధారపడవలసి వచ్చింది. అయితే మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పొందిన తర్వాత, ఆమె స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈ కాలంలో ఆమె తన తల్లిదండ్రులకు వారి గ్రామంలో ఇల్లు నిర్మించడంలో సహాయం చేసింది. తన తల్లిదండ్రులు ఇప్పుడు తన విజయాల పట్ల గర్వపడుతున్నారని మహాపాత్ర చెప్పారు. మహాపాత్ర తన బాల్యం నుంచే ఐఏఎస్ అధికారి కావాలని ఆకాంక్షించింది. ఆమె భర్త ప్రేరణ, మద్దతుతో, 2019లో తన ఐదవ ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది. అమరావతి జిల్లా పరిషత్ సీఈఓగా... స్వయం సహాయక బృందాలలో మహిళలకు సాధికారత కల్పించాలని, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్య నాణ్యతను మెరుగుపరచాలని తాను కోరుకుంటున్నానని మహాపాత్ర వివరించారు. ఆమె ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు, వాటి బ్రాండింగ్, ప్యాకేజింగ్ నుండి వాటి ప్రారంభం వరకు ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించడంపై దృష్టి సారించింది.

బడ్జెట్ 'దాడులు... పన్ను ఉగ్రవాదం' తొలగించాలి

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వ 'తిరోగమన విధానాలు' దేశంలోని పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని, 'వ్యాపారం చేయడంలో సౌలభ్యాన్ని అశాంతి'గా మార్చాయని కాంగ్రెస్ ఆదివారం ఆరోపించింది. దీనిని పరిష్కరించడానికి రాబోయే బడ్జెట్ 'రైడ్ రాజ్, పన్ను ఉగ్రవాదం' ను తొలగించాలని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. భారత తయారీ ఉద్యోగాలను రక్షించడానికి, వేతనాలు, కొనుగోలు శక్తిని పెంచడానికి నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని కూడా ఇది ప్రభుత్వానికి పిలుపునిచ్చింది. 'దేశంలో 'వ్యాపారాన్ని సులభతరం చేయడం' మెరుగుపరచాలనే కోరికను మోదీ ప్రభుత్వం చాలా కాలంగా ప్రకటించింది. అయితే గత దశాబ్దంలో 'రికార్డు కనిష్ఠ స్థాయికి పడిపోయిన ప్రైవేట్ పెట్టుబడుల సడలింపును, విదేశాలకు పెద్ద సంఖ్యలో వెళ్లిన వ్యాపారవేత్తల సడలింపును మాత్రమే మనం చూశాం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఇన్-ఛార్జ్, కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ అన్నారు. 'జీఎస్‌టీ, ఆదాయపు పన్ను రెండింటినీ వర్తింపజేసే అస్తవ్యస్తమైన, శిక్షాత్మకమైన, ఏకపక్ష పన్ను విధానం... ఇది పూర్తిగా పన్ను ఉగ్రవాదానికి సమానం. ఇప్పుడు భారతదేశ శ్రేయస్సుకు అతిపెద్ద ముప్పుగా మారింది. 'వ్యాపారం చేయడంలో అశాంతి'కి దోహదపడింది' అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 2014 నుంచి పెట్టుబడిలో అతిపెద్ద భాగం ప్రైవేట్ దేశీయ పెట్టుబడి బలహీనంగా ఉందని, మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో ఇది జీడీపీ పరిధిలో 25 నుంచి 30 శాతంలో ఉందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. గత పదేళ్లలో ఇది జీడీపీ పరిధిలో 20 నుంచి 25 శాతానికి పడిపోయింది. పెట్టుబడులు మందగించడం వల్ల అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు భారీగా వలస పోయారు.



గత దశాబ్దంలో 17.5 లక్షలకు పైగా భారతీయులు మరొక దేశ పౌరసత్వాన్ని పొందారు' అని ఆయన అన్నారు. 2022-2025 మధ్య 21,300 డాలర్ల-మిలియనీర్లు భారతదేశం విడిచి వెళ్లారని అంచనా. 'ఇదంతా మూడు కారణాల వల్ల జరుగుతోంది. మొదటిది, సంక్లిష్టమైన జీఎస్‌టీ. మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ప్రకారం, ప్రధానమంత్రి ప్రకటించిన మంచి, సరళమైన పన్ను రేట్లు సెస్సులతో సహా 100 వేర్వేరు పన్ను రేట్లను కలిగి ఉన్నాయి' అని తెలిపారు. బహుళ రేట్లు, గందరగోళం రూ.2.01 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతకు దోహదపడ్డాయని, ఇది 2022-23 ఆర్థిక సంవత్సరంలో నివేదించబడిన రూ.1.01 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు అని ఆయన అన్నారు. 18,000 మోసపూరిత సంస్థలు బయటపడ్డాయని, ఇంకా చాలా మందిని గుర్తించలేకపోయారని జైరాం రమేశ్ వివరించారు. 'రెండవది, దీనికి విరుద్ధంగా వాదనలు ఉన్నప్పటికీ, 2023-24లో 85 బిలియన్ డాలర్ల రికార్డు వాణిజ్య లోటుతో భారతదేశంలోకి చైనా దిగుమతులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇది భారతీయ తయారీని, ముఖ్యంగా శ్రమతో కూడిన రంగాలను దెబ్బతీసింది. ఇక మూడవది, వ్యక్తిగత రుణం ఉచితంగా అందుబాటులో ఉన్నప్పటికీ బలహీనమైన వినియోగం, స్తబ్దత వేతనాలు భారతదేశ వినియోగ వృద్ధిని తగ్గించాయి' అని ఆయన అన్నారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, యూపీఏ హయాంలో వ్యవసాయ కార్మికుల నిజ వేతనాలు సంవత్సరానికి 6.8 శాతం పెరిగాయని, మోదీ ప్రభుత్వ హయాంలో సంవత్సరానికి 1.3 శాతం తగ్గాయన్నారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే సమాచారాన్ని ఉటంకిస్తూ, జీతం పొందేవారు, సాధారణం, స్వయం ఉపాధి పొందుతున్న వారందరిలో 2017-2022 మధ్య సగటు నిజ ఆదాయాలు స్తబ్దుగా ఉన్నాయని ఇది చూపిస్తుందని ఆయన తెలిపారు. 'ఈ తిరోగమన విధానాలు భారతదేశంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. దీనిని పరిష్కరించడానికి, బడ్జెట్‌లో రైడ్ రాజ్, పన్ను ఉగ్రవాదం తొలగించాలి. భారతీయ తయారీ ఉద్యోగాలను రక్షించడానికి చర్య తీసుకోవాలి, వేతనాలు, కొనుగోలు శక్తిని పెంచడానికి నిర్ణయాత్మక చర్య తీసుకోవాలి. ఇది భారతీయ వ్యాపారాన్ని పెట్టుబడి పెట్టడానికి ప్రోత్సహిస్తుంది. తక్కువ ఏమీ చేయదు' అని జైరాం రమేశ్ నొక్కి చెప్పారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ఖాతాపై తన ప్రకటనను పంచుకుంటూ, '2025-26 కేంద్ర బడ్జెట్‌ను ఈ రోజు నుంచి 13 రోజుల్లో సమర్పించనున్నారు. మోదీ ప్రభుత్వం వ్యాపారాన్ని సులభతరం చేయడంలో అశాంతికి ఎలా మార్చిందనే దానిపై మా ప్రకటన ఇక్కడ ఉంది. తద్వారా ప్రైవేట్ పెట్టుబడి సెంటిమెంట్‌ను నిరుత్సాహపరుస్తుంది. నష్టాన్ని పరిష్కరించడానికి తీవ్రమైన చర్య అవసరం' అని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ దాడి చేస్తోంది. ధరలు పెరగడం, తగ్గుతున్న ప్రైవేట్ పెట్టుబడులు, స్తబ్దుగా ఉన్న వేతనాలు సామాన్య ప్రజలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆరోపిస్తోంది.

మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం

- పేలిన గ్యాస్ సిలిండర్లు

- ఎవరికీ అపాయం జరగలేదన్న అధికారులు

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతున్న ప్రదేశంలో గల ఓ శిబిరంలో రెండు వంట గ్యాస్ సిలిండర్లు పేలి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు సమీపంలోని వివిధ గుడారాలకు వ్యాపించాయి. ఘటనా స్థలంలో భారీగా పొగలు అలుముకున్నాయి. హుటాహుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పివేశారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి అపాయం జరగలేదని, ఎవరూ గాయపడలేదని అధికారులు చెబుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వచ్చే యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన సెక్టార్ 19- గీతా ప్రెస్ గుడారంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మంటలు చెలరేగాయి. తదుపరి సమీపంలోని మరో 10 గుడారాలకు మంటలు వ్యాపించాయి. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఎటువంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు. "మహా కుంభమేళాలోని సెక్టార్ 19లో రెండు సిలిండర్లు పేలి శిబిరాల్లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు" అని అఖారా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ భాస్కర్ మిశ్రా తెలిపారు. "చాలా విచారకరం! మహా కుంభ్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. తక్షణ సహాయక చర్యలు అందిస్తున్నారు. అందరి భద్రత కోసం మేం గంగమ్మను ప్రార్థిస్తున్నాం" అని కుంభమేళా నిర్వాహకులు పోస్ట్ చేశారు.

రూ.కోటి విలువైన సిగరెట్లు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అక్రమంగా రవాణా చేస్తున్న కోటి రూపాయల విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లోని విజయవాడ యాంటీ-ఎవేషన్ అధికారులు 25,38,000 సిగరెట్ స్టిక్స్, 46వేల పౌచ్ స్పిట్ టొబాకో (ఖైనీ) స్వాధీనం చేసుకోవడం ద్వారా పెద్ద అక్రమ నిల్వ, అక్రమ వ్యాపారాన్ని అడ్డుకున్నామని వివరించారు. వాటి విలువ ఎంఆర్‌పీ ప్రకారం కోటి రూపాయలు వుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీన జరిగిన ఒక ముఖ్యమైన ఆపరేషన్‌లో, గుంటూరు సీజీఎస్టీ కమిషనరేట్‌లోని విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లో కస్టమ్స్ కమిషనరేట్ (ప్రివెంటివ్) అధికారుల సహాయంతో అంబాపురం పంచాయతీలోని నమోదుకాని ప్రాంగణాలలో అధికారులు సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా భారతీయ మూలం సిగరెట్లు, ఖైనీ (స్పిట్ టొబాకో) అక్రమ నిల్వ, అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తద్వారా పన్ను చెల్లింపును ఎగవేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. అధికారులు తనిఖీలు అనంతరం, ఆ ప్రాంగణంలో గణనీయమైన మొత్తంలో భారతీయ మూలం సిగరెట్లు నిల్వ ఉన్నట్లు తేలిందని, 102 హెచ్‌డీపీఈ సంచుల్లో 25.38 లక్షల జీటీపీఎల్ విమల్, గోల్డ్ విమల్, గోల్డ్ ఫ్లేక్, పారిస్ సిగరెట్ స్టిక్కులు కలిగి ఉన్నట్లు, వీటి విలువ రూ.96.82 లక్షలు వుంటుందని కమిషనర్ వెల్లడించారు.

కోర్టులు-మీడియా సమన్వయంతో పని చేయాలి

ఏఐ... అంతిమ ప్రామాణికం కాదు

జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో న్యాయమూర్తులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కోర్టులు... మీడియా పరస్పర సహకారం, సమన్వయంతో పని చేయాల్సి ఉందని, జవాబుదారీ తనంతో కూడిన పనితీరు ప్రదర్శిస్తూ, బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఏయూ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన సౌత్ జోన్-2 రెండు రోజుల జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో భాగంగా రెండో రోజైన ఆదివారం 'జ్యుడీషియరీ అండ్ మీడియా-అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ త్రూ ఎమెర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్' అనే అంశాలపై చర్చ నిర్వహించారు. మేథోపరమైన చర్చలో పలు అంశాలపై తమ ఆలోచనలు పంచుకున్నారు. ట్రయిల్ కోర్టు, ఇతర న్యాయపరమైన అంశాల్లో మీడియా పాత్ర ఎలా ఉండాలి, దాని పరిధి, పరిమితులపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో జరిగిన సంఘటలను సోదాహరణంగా వివరించారు. అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భావితర జడ్జిలు ఎలా వ్యవహరించాలనే కోణంలో విశ్లేషణ జరిపారు. తొలుత సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన 'కోర్టులు - మీడియా పాత్ర' అనే అంశంపై చర్చ జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య వ్యవహరించారు. అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్... జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన చర్చ జరగ్గా, కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎం. ముస్తాక్యు, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సుందర్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ విధానాలను వివరించారు.

విశ్వసనీయత ఉండాలి: కురియన్ జోసెఫ్

మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని, అదే పరస్పర సహకారానికి ప్రామాణికంగా నిలుస్తుందని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ పేర్కొన్నారు. కోర్టు వ్యవహారాల్లో, సమాచార చేరవేతలో మీడియా పాత్ర, తీర్పులు, ఇతర ప్రొసీజరల్ అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్రపై సుదీర్ఘంగా మాట్లాడారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా ప్రస్తుతం పోషిస్తున్న పాత్రపై అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తులకు సూచించారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ మాట్లాడుతూ... ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రాచుర్యం సంపాదించుకున్న మీడియా... కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ప్రజల గొంతుకగా పని చేస్తున్న మీడియా మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉందని పేర్కొన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను వార్తలుగా రాయకూడదని, నిజాలను నిర్ధారించుకొని వాస్తవాలను వార్తలుగా ప్రచురించాలని హితవు పలికారు. ట్రయల్ అంశాలను ముందుగా బహిర్గత పరచకూడదని, ప్రతికూల ప్రభావాలను చూపరాదని సూచించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పని చేసే వారంతా మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కోల్ కతాలో జరిగిన ఆర్జీకర్ ఆసుపత్రి ఘటన, ఇతర ఘటనల్లో మీడియా వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలను వివరిస్తూ భవిష్యత్తులో వాటిని ఉదాహరణగా తీసుకొని జాగ్రత్త వహించాలన్నారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సుందర్ విశ్లేషణ చేశారు. ఏఐ అనేది న్యాయమూర్తులకు సహకారిగా మాత్రమే ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు ఏఐ టెక్నాలజీని పరిగణనలోకి తీసుకోవచ్చుని, కానీ దానినే తుది నిర్ణయంగా, అంతిమ ప్రామాణికంగా తీసుకోరాదని సూచించారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం. ముస్తాక్యు... కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ టెక్నాలజీ గురించి వివరించారు. కేరళలో కోర్టు వ్యవహారాల నివేదికలను రూపొందించేందుకు ఏఐ, గూగుల్ నోట్ బుక్ సాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. ఏఐ వినియోగంలో సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ జ్యుడీషియల్ అకాడెమీ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ వందన సమర్పణ చేశారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ, సీనియర్ న్యాయమూర్తులు, హైకోర్టు, జిల్లా కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.